@vaartanews @mvnewstv

# మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

శనివారం

24 అక్టోబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02

సంచిక :111

పేజీలు : 12 వెల : 5/-




PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

## విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి



- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి
- సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, రుగ్మతలను ఎదుర్కోవడంతో పాటు దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకం కావాలి
- గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది
- దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి
- కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి



## సన్న వడ్లకు భలే గిరాకీ

- క్వింటాల్ ధర రూ.3500.. పొలాల వద్దే కొనుగోళ్లు!
- సన్నరకం వరి పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది
- వడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు

# తుమ్మిడిహెట్టిపై సీఎం గురి!

- తుమ్మిడిహెట్టిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు
- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీకి కసరత్తు
- ఫడణవీస్‌తో త్వరలో చర్చలు
- ఆదిలాబాద్‌లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు
- పాలమూరుకు ఆటంకం లేకుండా అదనపు నీరు
- శ్రీశైలం నుంచి 0.6 టీఎంసీల నీరు



హైదరాబాద్

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ సూత్రప్రాయంగా అంగీకరించారన్న సీఎం రేవంత్‌రెడ్డి చర్చల్లో 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఆటంకం లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులకు నీటిని ఎత్తి పోసేందుకు శ్రీశైలం నుంచి అదనంగా నీటిని సమకూర్చుకునేలా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆదిలాబాద్ - మిగతా 10లో



## లైసెన్స్‌కు కొత్త రూల్స్

- డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు
- భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భవన
- విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది

## భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు



- అమెరికా వర్క్ వీసా రూల్స్‌పై రూబియో
- అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం

## పెరుగుతున్న వాయు కాలుష్యం



- హైదరాబాద్, సంగారెడ్డిలో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం ఎక్కువ
- తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతోంది
- వాతావరణంలో కలుస్తున్న దుమ్ము, ధూళి వల్ల పీఎం
- 10 స్థాయి జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.



## భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

- 60 నిమిషాల పాటు గాల్లో ఉండేలా డిజైన్
- రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది.
- సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తయారీ..

# ఎల్‌నినో ముప్పు.. కరువు గండం!



- వచ్చే 8--10 నెలలు అప్రమత్తంగా ఉండాలి..
- సాగునీటి లభ్యతపై ఆందోళన
- యాసంగి పంటలు వేయొద్దని రైతులకు సీఎం విజ్ఞప్తి
- విద్యుత్, నీటి పొదుపుపై ప్రజలకు పిలుపు
- కరెంట్ విషయంలో పొదుపు మంత్రం పాటించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే 8 నుంచి 10 నెలలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. రాబోయే నాలుగు నెలల్లో సాగునీటి లభ్యతపై తీవ్ర అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని పేర్కొంటూ, రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితులు రావచ్చని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు ముందుగానే వివరించాలని అధికారులకు సూచించారు. - మిగతా 10లో



## దేశం ముందు వాస్తవాలు పెట్టండి

- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు–చైనా పాలసీపై తీవ్ర విమర్శలు
- భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.
- చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని ఆరోపించారు.
- అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి

# ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



- క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష
- లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు.
- మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మాణం

## సంపాదకీయం

# మళ్లీ చెలరేగుతున్న మాఫియా

ముంబైలో బాలీవుడ్ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస కాల్పుల ఘటనలు సినీ పరిశ్రమలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన దాడి ఈ భయాలను మరింత పెంచింది. గతంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నివాసం, ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ఇల్లు, రాజకీయ నాయకుడు బాబా సిద్ధిఖీపై జరిగిన దాడులను పరిశీలిస్తే.. కొన్ని ఘటనల్లో సల్మాన్ ఖాన్‌తో ఉన్న సంబంధాలను కారణంగా చూపుతూ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో ముంబైలో సినీ ప్రముఖుల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. ముంబైలోని జూహు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలు కలకలం రేపాయి. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన డ్రైవర్ గాయపడినట్లు పోలీసులు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ఘటన అనంతరం బయటకు వచ్చిన ఓ ఆడియో రికార్డింగ్‌లో అనిల్ పండిట్ అనే వ్యక్తి తనను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవాడిగా చెప్పుకున్నట్లు సమాచారం. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసేవారిని, తమకు అనుకూలంగా వ్యవహరించనివారిని లక్ష్యంగా చేసుకుంటామంటూ ఆ ఆడియోలో హెచ్చరికలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడి వెనుక హర్మన్ సంధు కూడా ఉన్నట్లు అనిల్ పండిట్ పేరును ప్రస్తావించినట్లు సమాచారం. 2024 అక్టోబర్ 12న మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ బాంద్రాలోని తన కుమారుడి కార్యాలయం సమీపంలో కాల్పులకు గురయ్యారు. ముగ్గురు దుండగులు ఆయనపై కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడిన సిద్ధిఖీని లీలావతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు. బాబా సిద్ధిఖీకి బాలీవుడ్ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా సల్మాన్ ఖాన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ హత్యకు తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న శుభమ్ లోంకర్ పేరుతో సోషల్ మీడియాలో పోస్టు వెలువడింది. సల్మాన్ ఖాన్‌కు మద్దతుగా నిలిచేవారికి హెచ్చరికలు జారీ చేస్తూ అందులో వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టైగర్ ష్రాఫ్ ఘటనకు, బాబా సిద్ధిఖీ హత్యకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, రెండు ఘటనల వెనుక ఒకే విధమైన ఉద్దేశం ఉందా? వాటి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందా? అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. 2024 ఏప్రిల్ 14న ముంబైలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ ఖాన్ నివాసం గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వెలుపల బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో విక్కీ గుప్తా, సాగర్ పాల్ అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆయుధాల సరఫరాకు సంబంధించి అనుజ్ థాపన్‌ను కూడా అరెస్టు చేశారు. అయితే 2024 మే 1న పోలీసు కస్టడీలో ఉండగా అతడు మరణించాడు. ఈ ఘటనపై కూడా పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి. సల్మాన్ ఖాన్‌పై దాడికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు బాధ్యత వహించినట్లు ప్రకటించారని వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌పై గతంలో కూడా బెదిరింపు లేఖలు, ఈ-మెయిళ్లు వచ్చినట్లు పోలీసు రికార్డుల్లో ప్రస్తావించబడింది. పన్వేల్‌లోని ఆయన ఫామ్‌హౌస్ పరిసరాల్లోనూ అనుమానాస్పద కదలికలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి కృష్ణజింకల వేట కేసును ప్రస్తావిస్తున్నారు.. కృష్ణజింకలను పవిత్రంగా భావించే బిష్ణోయ్ సమాజ విశ్వాసాలను ఈ వివాదానికి కారణంగా చూపుతున్నారు. బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్‌కు సన్నిహితంగా ఉన్నారని భావించే ఇతర ప్రముఖులపై కూడా దాడులు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2026 ఫిబ్రవరిలో జూహులోని ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద కాల్పులు జరిగాయి. ఈ ఘటనకు సంబంధించి శుభమ్ లోంకర్ పేరుతో వచ్చిన ఆరోపణలు, హర్మన్ సంధు పేరు ప్రస్తావన మరోసారి చర్చకు దారితీశాయి. ఇదే సమయంలో కెనడాలోని సర్రేలో హాస్యనటుడు కపిల్ శర్మకు చెందిన కేఫ్‌పై 2025 జూలై నుంచి పలుమార్లు కాల్పులు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌ను తన నెట్‌ఫ్లిక్స్ కార్యక్రమానికి ఆహ్వానించడమే ఈ దాడులకు కారణమని గ్యాంగ్‌తో సంబంధం ఉన్న వ్యక్తి పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. టైగర్ ష్రాఫ్ ఘటనకు సంబంధించి ఆడియోలో పేర్లు వినిపించిన వ్యక్తులు అమెరికాలో ఉన్నట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ వార్తలు పేర్కొన్నాయి. మరోవైపు, బాబా సిద్ధిఖీ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న అన్మోల్ బిష్ణోయ్‌ను 2025 నవంబర్‌లో అమెరికా నుంచి భారత్‌కు తీసుకొచ్చి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు నివేదికలు తెలిపాయి. అతడు పలు కేసులను ఎదుర్కొంటున్నాడు. ఈ పరిణామాలు నేర ముఠాల కార్యకలాపాలు, వాటి అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. ఒకవైపు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలకు బెదిరింపులు రావడం.. మరోవైపు వారి నివాసాలు, వ్యాపార సంస్థల వద్ద కాల్పుల ఘటనలు చోటుచేసుకోవడం ముంబై పోలీసులకు సవాలుగా మారింది. తాజా ఘటనల నేపథ్యంలో సినీ ప్రముఖుల నివాసాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. టైగర్ ష్రాఫ్ ఘటనతో బాలీవుడ్‌లో భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్‌తో సంబంధాలను ప్రస్తావిస్తూ బెదిరింపులు చేస్తున్నారనే ఆరోపణలు నిజమా? ఈ దాడుల వెనుక ఒకే నెట్‌వర్క్ ఉందా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తే సమాధానం చెప్పాల్సి ఉంది.

# 4 ప్రభుత్వ బ్యాంకుల్లో కేంద్రం వాటా విక్రయం

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు ప్రభుత్వ సంస్థల్లో క్రమంగా వాటాల్ని విక్రయిస్తున్నారు. ఆఫర్ ఫర్ సేల్ ప్రక్రియలో వాటాల అమ్మకం చేపడుతోంది. ఇటీవల ఐడీబీఐ బ్యాంకులో సుమారు 60.72 శాతం వాటాను కెనడా సంస్థకు విక్రయించే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ పలు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల్లో మెజార్టీ వాటా ఉంది. అయితే మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కనీసం 25 శాతం ఉండాలి. దీంతో 75 శాతానికిపైగా తమ వాటా ఉన్న సంస్థల్లో కేంద్రం క్రమంగా వాటాల్ని విక్రయిస్తూ వస్తోంది. ఒకవైపు ఈ నిబంధనకు తోడు నిధులు సమీకరించాలన్న లక్ష్యంతో మరికొన్ని సంస్థల్లోనూ వాటాల విక్రయం కోసం ఆఫర్ ఫర్ సేల్ నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాదిలో ఎల్ఐసీ సహా బీహెచ్ఈఎల్, ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, కోల్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇలా పలు ప్రభుత్వ సంస్థల్లో వాటాల్ని విక్రయించింది. కొద్ది రోజుల కిందట ప్రైవేట్ బ్యాంక్ ఐడీబీఐ బ్యాంకులోనూ కేంద్రం, ఎల్ఐసీ కలిసి 60.72 శాతం వాటాను కెనడా సంస్థకు విక్రయించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో ఇప్పుడు ఇతర ప్రభుత్వ బ్యాంకుల్లో వాటా విక్రయం సహా బ్యాంకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేంద్రం ప్రస్తుతం 4 ప్రభుత్వ రంగ బ్యాంకులు- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్లో తమ వాటాను విక్రయించి 75 శాతం దిగువకు చేర్చాలని భావిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ బ్యాంకుల విలీనం లేదా ప్రైవేటీకరణ అంశాలపైనా పనిచేస్తుందని తెలుస్తోంది. మరో 2 బ్యాంకుల్ని ప్రైవేటీకరించనున్నట్లు, ఆ దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు ఈ వ్యవహారం గురించి తెలిసిన వ్యక్తుల్ని ఉటంకిస్తూ మీడియా రిపోర్ట్స్ వస్తున్నాయి. 2021-22 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ విలీనాలు, బ్యాంకుల ప్రైవేటీకరణను ప్రస్తావించింది. ఐడీబీఐ బ్యాంకు కాకుండా, మరో రెండు ప్రభుత్వ బ్యాంకులు, సాధారణ ఇన్సూరెన్స్ కంపెనీని ప్రైవేటీకరించాలని చూస్తున్నట్లు ప్రకటించింది. ఆ దిశగానే ఇప్పుడు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఏ బ్యాంకుల్ని విలీనం చేస్తుంది, ఏ బ్యాంకుల్ని ప్రైవేటీకరించాలని చూస్తోంది అనే వివరాలు స్పష్టంగా తెలియరాలేదు. నీతి ఆయోగ్ మాత్రం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్ని ప్రైవేటీకరించడానికి షార్ట్ లిస్ట్ చేసినట్లు సమాచారం. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి 92.44 శాతం వాటా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 2.17 శాతం వాటా విక్రయించి రూ. 1419 కోట్లు సమీకరించింది.



సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 81.19 శాతం వాటాను కేంద్రం కలిగి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 8.08 శాతం వాటాను విక్రయించి సుమారు రూ. 2666 కోట్లు సేకరించింది.

యూకో బ్యాంకులో 90.95 శాతం వాటా ప్రభుత్వానిదే. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం 93.85 శాతం వాటా కలిగి ఉంది.

ఇక్కడ ఇంకా చాలానే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకులు 10కిపైగా ఉండగా, పలు చిన్న బ్యాంకుల్ని విలీనం చేసి దేశంలో 2-3 లేదా పెద్ద బ్యాంకుల్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కూడా తెలుస్తోంది. ఇందులో భాగంగానే తొలుత రాబోయే ఏడాదిలోగా పైన నాలుగు బ్యాంకుల్లో కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ 25 శాతం ఉండేలా వాటాల్ని విక్రయించి, ఆ తర్వాత ప్రైవేటీకరణ గురించి ప్లాన్ చేయనున్నట్లు భావిస్తున్నారు. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం, ఎల్ఐసీ 30.24 శాతం వాటాను విక్రయించనుండగా, మొత్తం 60.72 శాతం వాటాను సుమారు రూ. 53 వేల కోట్లకు విక్రయించనుంది. ఈ ప్రతిపాదనకు కొద్ది రోజుల కిందటే కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చింది. కెనడాలోని ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ కెనడా ఇంక్‌కు విక్రయించనుంది. అప్పుడు మెజార్టీ వాటా ఆ సంస్థదే అవుతుంది. వాటా విక్రయం తర్వాత కూడా ఎల్ఐసీకి సుమారు 19 శాతం వాటా ఉంది

# తండ్రి కాబోతున్న గే పీఎం

**న్యూఢిల్లీ :** నెదర్లాండ్స్ రాజకీయాల్లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఓ ఆసక్తికరమైన వార్త చర్చనీయాంశంగా మారింది. ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్, ఆయన భాగస్వామి, అర్జెంటీనాకు చెందిన హాకీ క్రీడాకారుడు నికోలస్ కీనన్ తల్లిదండ్రులు కాబోతున్నారు. స్వలింగ సంపర్కులైన ఈ జంట సరోగసీ విధానం ద్వారా బిడ్డను తమ జీవితంలోకి ఆహ్వానించేందుకు సిద్ధమైంది. 2027లో తమ కుటుంబంలోకి చిన్నారి రానున్నట్లు జెట్టెన్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో అసలు సరోగసీ అంటే ఏమిటి? ఇద్దరు పురుషులు ఈ విధానం ద్వారా తండ్రులు ఎలా అవుతారు? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. సరోగసీ అనేది సంతానం కోసం మరో మహిళ సహాయాన్ని తీసుకునే వైద్యపరమైన విధానం. కొన్ని కారణాల వల్ల స్వయంగా గర్భం దాల్చలేని వ్యక్తులు లేదా దంపతులు ఈ పద్ధతిని ఆశ్రయిస్తారు. ఇందులో గర్భాన్ని మోసే మహిళను 'సరోగేట్ మదర్' అంటారు. వైద్యపరమైన ప్రక్రియ ద్వారా ఆమె గర్భం దాల్చి, శిశువుకు జన్మనిస్తుంది. ఆ తర్వాత చట్టపరమైన నిబంధనలు, ముందస్తు ఒప్పందాల ప్రకారం బిడ్డ సంరక్షణ బాధ్యతలను ఉద్దేశిత తల్లిదండ్రులు స్వీకరిస్తారు. సాధారణంగా సరోగసీలో రెండు ప్రధాన విధానాలు ఉంటాయి. మొదటిది సంప్రదాయ సరోగసీ. ఇందులో గర్భాన్ని మోసే మహిళ అండం ఉపయోగించబడుతుంది. రెండోది గెస్టేషనల్ సరోగసీ. ఇందులో ఉద్దేశిత తల్లిదండ్రుల్లో ఒకరి లేదా దాత అండం, వీర్యాన్ని ఉపయోగించి ప్రయోగశాలలో పిండాన్ని తయారు చేస్తారు. అనంతరం ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంలో గర్భాన్ని మోసే మహిళకు బిడ్డతో జన్యుపరమైన సంబంధం ఉండకపోవచ్చు. స్వలింగ సంపర్కులైన ఇద్దరు పురుషులు సంతానం పొందాలనుకున్నప్పుడు గెస్టేషనల్ సరోగసీ ఒక మార్గంగా ఉంటుంది. ఇందుకోసం సాధారణంగా అండదాత సహాయం తీసుకుంటారు. వైద్య నిపుణులు ఒక పురుష భాగస్వామి వీర్యంతో దాత అండాన్ని ఫలదీకరణం చేసి పిండాన్ని తయారు చేయవచ్చు. ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. గర్భధారణ సజావుగా సాగితే ఆమె బిడ్డకు జన్మనిస్తుంది. ఈ ప్రక్రియలో బిడ్డకు జన్యుపరంగా ఒక తండ్రితో సంబంధం ఉండవచ్చు. మరో భాగస్వామి తండ్రిగా చట్టపరమైన గుర్తింపు పొందడం మాత్రం సంబంధిత దేశంలోని చట్టాలు, తల్లిదండ్రుల గుర్తింపు విధానాలు, అవసరమైన న్యాయ ప్రక్రియలపై ఆధారపడి ఉంటుంది. అంటే సరోగసీ ద్వారా బిడ్డను పొందడం వైద్యపరమైన ప్రక్రియ మాత్రమే కాదు.. దానికి సంబంధించిన చట్టపరమైన అంశాలను కూడా ముందుగానే పరిశీలించాల్సి ఉంటుంది. జెట్టెన్, కీనన్‌లకు 2024లో నిశ్చితార్థం జరిగింది. అయితే ప్రధాని బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తమ వివాహ ప్రణాళికల్లో మార్పులు చేసుకున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఇప్పుడు తమ జీవితంలోకి కొత్త సభ్యుడు రానుండటంతో ఈ జంట ఆనందంలో మునిగిపోయింది. తమ బిడ్డ 2027లో జన్మించనున్నట్లు ప్రకటిస్తూ, తమకు సహకరించిన అండదాతకు, సరోగేట్ తల్లికి కృతజ్ఞతలు తెలిపారు. గర్భాన్ని మోస్తున్న మహిళ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కూడా వెల్లడించారు. సామాజిక సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో నెదర్లాండ్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2001 ఏప్రిల్ 1న స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన ప్రపంచంలోనే తొలి దేశంగా నెదర్లాండ్స్ చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు మహిళలు చట్టబద్ధంగా వివాహం చేసుకునేందుకు అక్కడ అవకాశం ఉంది.

# ఎల్‌ఏసీలో చైనా కవ్వింపు

ఇరుగు పొరుగుతో సంబంధాలు చాలా సున్నితమైనవి. సరిహద్దు వివాదం ఉంటే అది అత్యంత సంక్లిష్టమైన వ్యవహారంగా మారుతుంది. పరిష్కారం సాధించదల్చుకున్నప్పుడు ఇచ్చిపుచ్చుకోవడాలుంటాయి. అందులో కాస్త హెచ్చుతగ్గులుంటే చాలు... విపక్షాలు విరుచుకుపడతాయి. ఇక అవతలి సైన్యం బలవంతంగా చొరబడి ఘర్షణలకు దిగితే చెప్పేదేముంది? అరుణాచల్ ప్రదేశ్‌లోగల వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) పొడవునా చైనాతో గత జూలైనుంచి పలుచోట్ల వివాదాలు తలెత్తుతున్నాయని ఇండో--టిబెటిన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) దళం చీఫ్ శత్రుజిత్ కపూర్ నోరు జారటం తాజా వివాదానికి కారణం.



ఈ నెలాఖరున రిటైర్ కాబోతున్న సందర్భంగా రాజస్థాన్‌లోని ఆళ్వార్‌లో ఐటీబీపీలోని శౌర్య కమాండో దళం సమర్థతను ప్రశంసిస్తూ ఆయన ఈ మాటలన్నారు. అంతే, కాంగ్రెస్ వైపునుంచి విమర్శలు మొదలయ్యాయి. గత నెల 12న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చారు. 2020నాటి గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత ఆయన మన దేశానికి రావటం ఇదే ప్రథమం. సరిహద్దులు ప్రశాంతంగా ఉంటేనే సాధారణ సంబంధాలు మెరుగుపడతాయనీ, దాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామనీ ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్‌లు అవగాహనకొచ్చారు. శత్రుజిత్ చెబుతున్న ప్రకారం జూలైనుంచీ సరిహద్దుల్లో అలజడి ఉంటుండగా ఇరు దేశాల అధినేతల మధ్యా ఇంత సుహృద్భావం ఎలా సాధ్యమైందన్న సందేహం ఎవరికైనా వస్తుంది. కనీసం సెప్టెంబర్ తర్వాతైనా పరిస్థితి చక్కబడాలి కదా అనిపిస్తుంది. రక్షణ దళాల చీఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, విదేశాంగమంత్రి జైశంకర్ చైనా సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని వేర్వేరు సందర్భాల్లో చెప్పారు. ఎప్పటికప్పుడు సైన్యాధికారుల స్థాయి భేటీ జరగటంవల్ల ఆందోళన పడేంత అస్థిరత లేదని జనరల్ సుబ్రమణి తెలిపారు. జైశంకర్ అయితే 2024 ముందుకన్నా పరిస్థితి మెరుగ్గా ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో సహజంగానే శత్రుజిత్ మాటల్ని కాంగ్రెస్ అందిపుచ్చుకుంది. ఎల్‌ఏసీలో ఏం జరుగుతున్నదో దేశ ప్రజలకు తెలియాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉంటే... ఐటీబీపీ చీఫ్ చేసిన ఈ ప్రకటన ఎంత దుమారం రేపేదో ఊహించటం కష్టమేమీ కాదు. 1962 చైనా యుద్ధంలో అప్పటి ప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరువల్ల దేశానికి కలిగిన నష్టం గురించి ఇప్పటికీ తరచు బీజేపీ నేతలు చెబుతుంటారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు పొంతన లేకుండా మాట్లాడిన సందర్భం ఏర్పడితే బీజేపీ దాన్ని మామూలుగా వదిలేది కాదు. కాంగ్రెస్‌కున్న పరిమితులవల్ల అది ఆ స్థాయిలో స్పందించలేకపోతోందని చెప్పాలి. ఐటీబీపీ సేవలు నిరుపమానమైనవి. లద్దాఖ్‌లోని కారకోరం మొదలుకొని హిమాచల్‌లోని జరేప్ లా వరకూ గల 3,488 కిలోమీటర్ల నిడివుండే ఎల్‌ఏసీ అత్యంత ప్రమాద కరమైనది. అక్కడ ఆక్సిజెన్ లభ్యత అంతంతమాత్రం. శరీరం గడ్డకట్టేంత చలి. ఎత్తయిన కొండలు, చుట్టూ లోయలుండే ఆ ప్రాంతంలో ఏమాత్రం అప్రమత్తత కొరవడినా ప్రాణాలు మిగలవు. చైనా సైనికులు ఏదో చోట లోపలకి చొచ్చుకొచ్చి ఇదంతా తమదే ననటం, కవ్వింపునకు దిగటం నిత్యకృత్యం. స్వల్ప తగాదా కూడా క్షణంలోనే ఉద్రిక్తంగా మారుతుంది. గస్తీ బాధ్యతల్లో ఉండే ఐటీబీపీ దళానికి ఓర్పు, సహనం, అవతలిపక్షానికి నచ్చజెప్పే నేర్పు, ఆ ఘర్షణను అక్కడికే పరిమితం చేయగలిగే వ్యూహం ఉంటేనే రోజు గడుస్తుంది. లేదంటే ఆ వివాదం విస్తరిస్తుంది. అందుకు గల్వాన్ లోయ ఘర్షణలే ఉదాహరణ. అక్కడ మన దళాలు చైనాకు గణనీయంగానే నష్టం కలిగించినా... మనవైపు 20మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మొత్తానికి ఐటీబీపీ చీఫ్ ప్రసంగం చూస్తే చైనా తన వెనకటి గుణం మానుకోలేదని అర్థమవుతుంది. అధినేతల స్థాయి సమావేశాల్లో పెద్ద మనిషి తరహాగా ఉండటం, క్షేత్రస్థాయిలో గిల్లికజ్జాలకు దిగటం మొదటినుంచీ దానికి అలవాటు. వాణిజ్యం, సరిహద్దు వివాదం-- దేనిదారి దానిదేననే చైనా వాదనను ఇకపై అంగీకరించకూడదు. చిత్తశుద్ధి లోపిస్తే సామరస్యత సాధ్యంకాదనీ, కవ్వింపు చర్యలకు స్వస్తి పలకాలనీ నిక్కచ్చిగా చెప్పాలి.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపునకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మద్దతు

**జవహర్ నగర్, అక్టోబర్ 23 (వార్త ప్రతినిధి):**

20 ఏళ్లుగా జవహర్ నగర్ ప్రజలను పట్టి పీడిస్తున్న రాంకీ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డంపింగ్ యార్డు తొలగింపుకు సహకరించాలని కోరుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత జేఏసీ పోరాట కమిటీ నేతలు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.

ఈ మేరకు జేఏసీ చైర్మన్ షేక్ షావలి వివరాలు వెల్లడించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గతంలో ఆటోనగర్ డంపింగ్ యార్డు సమస్యపై సుదీర్ఘ పోరాటం చేసిన నేతగా పేరు పొందారని, ప్రస్తుతం మన్సూరాబాద్ డంపింగ్ యార్డు నుండి వెలువడుతున్న తీవ్ర దుర్వాసనపై 20 కాలనీల్లో స్వయంగా పర్యటించి, పరిష్కారం కోసం ప్రజాప్రతినిధిగా చర్యలు చేపడుతున్నారని షావలి తెలిపారు.

అదే విధంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. యార్డు నుండి వెలువడుతున్న లీచెట్, మిథేన్ వాయువుల కారణంగా భూగర్భ జలాలు, గాలి, నీరు పూర్తిగా విషతుల్యంగా మారాయని, దీంతో చుట్టుపక్కల 10 కిలోమీటర్ల పరిధిలోని మహిళలు, పిల్లలు, వృద్ధుల



ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా ఒకరిగా పాల్గొని సమస్య తీవ్రతను స్వయంగా ఎత్తిచూపారని, అందుకే ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మద్దతు కోరామని పేర్కొన్నారు.

**అఖిలపక్షం డిమాండ్లు:**

ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఎమ్మెల్యేను కోరిన అంశాలు..

1. జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు ఒక ఖచ్చితమైన గడువును ప్రకటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలి.
2. చట్టసభల్లో వారి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల ద్వారా ఈ సమస్యను లేవనెత్తాలి.
3. డంపింగ్ యార్డు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

**మద్దతుగా నిలబడుతా: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి:**

వినతి పత్రం స్వీకరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పందిస్తూ.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు బాధితుల పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

హైదరాబాద్ మహానగరంలో ఒకే చోట భారీగా చెత్తను డంప్ చేయడం వల్లనే ఈ సమస్య వస్తోందని, దీనికి పరిష్కారంగా హైదరాబాద్ చుట్టూ ఎక్కడి చెత్తను అక్కడే ప్రాసెస్ చేసేలా 6 నుండి 10 చిన్న డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం వల్లనే జవహర్ నగర్ వంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు సీపీఎం నేత శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత వి. ప్రవీణ్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి చెందిన మహ్మద్ పాషామియా, టీవీఆర్ఎస్ మోనార్ దుర్గాప్రసాద్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అల్లూరి సావిత్రి, పీవోడబ్ల్యూ (విముక్తి) నాయకురాలు గడిపే సునీత, సీనియర్ జర్నలిస్ట్ కొన్నె వేణు, టీయూసీఐ నేత జి. లింగం తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా అర్హులందరూ నమోదు చేసుకోవాలి

**- క్లస్టర్ ఇంచార్జ్ ఆబోతు అశోక్ యాదవ్**

**ఖానాపురం అక్టోబర్ 23( మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :**

ఖానాపురం క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు చెందిన అర్హులైన పట్టభద్రులందరూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల

ఖానాపురం క్లస్టర్ ఇంచార్జ్ ఆబోతు అశోక్ యాదవ్ పిలుపునిచ్చారు. 2023 నవంబర్‌కు ముందు డిగ్రీ పూర్తి చేసి, ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పట్టభద్రులు నవంబర్ 6లోపు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఈసందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ, పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.



ఓటరు నమోదుకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ నంబర్, డిగ్రీ మెమో లేదా డిప్లొమా ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఫోన్ నంబర్ అవసరమని తెలిపారు. ఈ పత్రాలను అందజేసి మనుబోతుల గడ్డ గ్రామంలో ఉచితంగా ఓటరు నమోదు సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. వివరాలను వాట్సాప్ ద్వారా పంపించి కూడా నమోదు ప్రక్రియలో సహకారం పొందవచ్చని, స్వయంగా దరఖాస్తు చేసుకునేవారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని అశోక్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పట్టభద్రుడి గొంతుక అని, అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి ఓటరుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఓటరు నమోదు వివరాల కోసం 9948348025, 8099245757సంప్రదించవచ్చునన్నారు.

# రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువుకు మహర్దశ...!

**- శరవేగంగా సుందరీకరణ పనులు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**రామంతాపూర్, అక్టోబర్ 23 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడుతోంది. రామంతాపూర్ పెద్ద చెరువు రూపురేఖలు మార్చే లక్ష్యంతో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 18.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులు కేటాయించడంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

చెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల తీరును సమీక్షించారు. చెరువు పరిరక్షణతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అభివృద్ధి పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

చెరువుల పరిరక్షణతో పర్యావరణానికి రక్షణ చెరువులు నగరానికి జీవనాధారమని, వాటిని





పరిరక్షించడం భవిష్యత్ తరాల అవసరాలకు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. చెరువుల పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యతకు ఈ అభివృద్ధి పనులు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు చెరువుల పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూ.19 కోట్ల నిధులతో రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.చెరువు అభివృద్ధి పనులు కొనసాగుతుండటంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కీసర డీసీ రామలింగంను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన జవహర్ నగర్ కాంగ్రెస్ నేతలు

**జవహర్ నగర్, అక్టోబర్ 23 :(వార్త ప్రతినిధి)**

దసరా పండుగను పురస్కరించుకుని జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం ను మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన విజయదశమి స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యంగా, ఆనందంగా జీవించాలని కోరారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడంలో అధికారులు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా పనిచేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం నాయకులందరూ పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, నాయకులు గజ్వేల్ శంకర్, ఉపాధ్యక్షులు నాయకం భాస్కర్, కోశాధికారి పొలాస కిరణ్, సోమేశ్ చారి, గండి సునీత తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 23, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రేషన్ డీలర్లకు 5 వేల రూపాయల గౌరవ వేతనం చెల్లిస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీని వెంటనే అమలు చేయాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ లో గల మేరు సంఘం నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకురేషన్ డీలర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర కు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రేషన్ డీలర్లకు ఆదుకుంటామని ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న రేషన్ డీలర్ల యొక్క హామీలు నెరవేయడం లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టినటువంటి రేషన్ డీలర్లకు గౌరవ వేతనం 5 వేల రూపాయలు అమలు చేయాలని అదేవిధంగా క్వింటాల్ కు కనీసం 300 రూపాయల వరకు కమిషన్ ను పెంచాలని అదేవిధంగా దిగుమతి హామాలి ఖర్చులను ప్రభుత్వమే భరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు జిల్లా అధ్యక్షులు నగేష్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి జిల్లా రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు**




**ఖానాపురం, అక్టోబర్ 23 (మల్లేష్ మీ వార్త ప్రతినిధి):**

అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు. ఖానాపురం మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో నిర్వహించిన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ మండల కోఆర్డినేటర్ కోడి మల్లేష్, చలిగంటి మల్లిఖార్జున్ ,సోషల్ మీడియా ఇన్‌చార్జి నాంచారి కుమారస్వామి, సొసైటీ డైరక్టర్ శివరాత్రి వెంకన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.కె. కమాలుద్దీన్, నాయకులు తేజావత్ మిత్యా, ఎద్దు మహేందర్, ఆబోతు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## - బుర్ర వెంకటేష్ గౌడ్

**చిట్యాల అక్టోబర్ 23( మీవార్త ) :**



అర్హురైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సంబంధంలేని బిజెపి మండల అధ్యక్షుడు గుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. 2023 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి అర్హుడైన పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. అర్హులు నిర్ణీత గడువులోగా ఫారం--18 ద్వారా దరఖాస్తు లేదా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుత 2026--27 ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అర్హత తేదీ 2023 అక్టోబర్ 31లోపు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని వెంకటేష్ అన్నారు.

## కేటీఆర్‌తో పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష శ్రీకాంత్ భేటీ

**పటాన్ చేరు అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి :**

**- దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్**

**- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచన**



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పార్టీ కార్యకలాపాలు, స్థానికంగా బీఆర్ఎస్ బలోపేతంపై చర్చించారు. పట్టణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనాలని కేటీఆర్ సూచించినట్లు ఈర్ల నితీష శ్రీకాంత్ తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు నిబద్ధతతో పనిచేస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీలో పటేల్‌గూడ మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, సింగారం నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లు దేశంలో అమలు చేయాలి



(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 23, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

కుల వివక్షకు స్వస్తి పలికి, ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ ఆర్థిక రిజర్వేషన్ల అవగాహన రథయాత్ర కొనసాగుతుంది. ఆర్థిక్, ఆధార్, ఆరక్షన్ ఆందోళన్ సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్ అరోరా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రథయాత్ర నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డులో గల ఓ హాల్ లో మీడియాతో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా యాత్ర నిర్వహిస్తున్నామని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. అక్టోబర్ 2న ఢిల్లీలోని రాజ్‌ఘాట్ నుంచి ప్రారంభమైన ఆర్థిక రిజర్వేషన్ల అవగాహన రథయాత్ర కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంది. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వాహకులు ఈ యాత్రను చేపట్టారు. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితుల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. యువత, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములై ఐక్యంగా, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ రథయాత్ర కార్యక్రమంలో ఆర్థిక, ఆధార్, ఆరక్షణ ఆందోళన్ తెలంగాణ కోఆర్డినేటర్ కర్ణాకర్ రెడ్డి, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై జవహర్ నగర్ కాంగ్రెస్ సమీక్ష - డివిజన్ల వారీగా ఇన్‌చార్జీల నియామకం

జవహర్ నగర్, అక్టోబర్ 23: (వార్త ప్రతినిధి)



మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంపై జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించింది.

జవహర్ నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

పట్టభద్రులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకోసం డివిజన్ల వారీగా, బూత్ స్థాయిలో ఇన్‌చార్జీలను నియమించి, ఇంటింటికి తిరిగి అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయాలని తీర్మానించారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారాలను నాయకులు, కార్యకర్తలకు అందజేసి, సత్వరమే నమోదు పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గజ్వేల్ శంకర్, ఉపాధ్యక్షులు నాయకం భాస్కర్, కోశాధికారి పొలాస కిరణ్, నాయకులు మనోహర్ రెడ్డి, కృష్ణ గౌడ్, కొలిపాక సాయి కిరణ్, అజయ్, సోమేశ్ చారి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం

**- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (23):



వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన దొంతి గ్రామంలో చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి గ్రామానికి చెందిన బొడ్డు నాగరాజు (36) దినసరి కూలీగా పనిచేస్తుండగా, ఆయన భార్య కవిత పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తోంది. నాగరాజు మద్యానికి బానిసైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 19న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి నాగరాజు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మిషన్ భగీరథ లైన్‌మెన్ మృతి

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (23):



గుర్తుతెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయాలైన మిషన్ భగీరథ లైన్‌మెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన గొల్ల లచ్చయ్య (60) గత కొన్నేళ్లుగా మిషన్ భగీరథ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో పైప్‌లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న శివ్వంపేటలోని మిషన్ భగీరథ సంపును పరిశీలించిన అనంతరం రాత్రి సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో సామ్య తండా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆయన సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లచ్చయ్య తలకు తీవ్ర గాయాలై, అధిక రక్తస్రావం జరిగింది. ప్రమాదాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న లచ్చయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మిషన్ ఇంద్రధనస్సు, కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

**- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్**

ఖానాపురం అక్టోబర్ 23(మల్లేష్ మీ వార్త ప్రతినిధి):





ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం మిషన్ ఇంద్రధనస్సు అమలు తీరును సమీక్షించారు. అనంతరం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్న ధర్మారావుపేట సబ్‌సెంటర్‌ను సందర్శించి, టీకాల పంపిణీపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. సాధారణ టీకాల కార్యక్రమంలో భాగంగా టీకాలు వేయించుకోని పిల్లలు, గర్భిణులను గుర్తించి, వారికి తప్పనిసరిగా టీకాలు వేయించడమే మిషన్ ఇంద్రధనస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

**కుష్టు వ్యాధి గుర్తింపునకు 14 రోజుల ఇంటింటి సర్వే :**

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి 14 రోజులపాటు ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అనుమానిత కేసులను గుర్తిస్తారని వివరించారు.

శరీరంపై స్పర్శలేని మచ్చలు, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, నరాల బలహీనత, స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. కుష్టు వ్యాధికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని, వ్యాధి పట్ల భయాందోళనలు అవసరం లేదని పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. కుష్టు రహిత సమాజ సాధనే ఈ కార్యక్రమం లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి :**

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితుల్లో వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రకాష్ సూచించారు. ప్రజలు ఎక్కువగా నీరు తాగాలని, మధ్యాహ్న సమయంలో ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు. వేసవి కాలంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం పిహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి, సబ్‌యూనిట్ ఆఫీసర్ నంద, వైద్య సిబ్బంది శ్రీనివాస చారి, దేవిక, చిన్ని, సబిత, ప్రతిభ, భాస్కర్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శరవేగంగా రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు







**- రూ.19 కోట్లతో చెరువు అభివృద్ధి.. పనుల పురోగతిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు**

రామంతాపూర్, అక్టోబర్ 23 ( మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. చెరువు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించగా, హైడ్రా ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతిని హబ్సీగూడ, రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆయా డివిజన్ల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మొత్తం 18.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువు పరిసర ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో చెరువు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. చెరువు సుందరీకరణ కోసం ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. గతంలో చెరువుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెరువుల సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉప్పల్ మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా చెత్తాచెదారంతో నిండిపోయిన రామంతాపూర్ పెద్ద చెరువు ప్రాంత రూపురేఖలను మార్చేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. చెరువు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి, పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి హబ్సీగూడ డివిజన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, హబ్సీగూడ డివిజన్ కోఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్, సీనియర్ నాయకులు మురళీకృష్ణ ముదిరాజ్, ధర్మా నాయక్, కిషన్ నాయక్, రాజు నాయక్, రమేష్ నాయక్, లక్ష్మీనారాయణ, గుండు రాజన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. హబ్సీగూడతో పాటు రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఉప్పల్ భగాయత్ ఫేజ్-2కు రూ.5.86 కోట్ల నిధుల మంజూరు

**- రెండు ప్రధాన రహదారుల రీకార్పెటింగ్ పనులకు నిధులు..**

**- మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మంజూరు చేయించిన మాజీ కార్పొరేటర్ రజిత రెడ్డి**

ఉప్పల్, అక్టోబర్ 23 ( మన మీ వార్త):







ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కొనసాగుతోంది. లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో రూ.5.86 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి ఈ నిధులను మంజూరు చేయించారు. ఫేజ్-2లో దెబ్బతిన్న రెండు ప్రధాన రహదారులకు రీకార్పెటింగ్ పనులు చేపట్టేందుకు ఈ నిధులను కేటాయించారు.

**- రెండు రహదారుల అభివృద్ధికి నిధుల కేటాయింపు**

1. రూ.3.88 కోట్లతో రహదారి రీకార్పెటింగ్: ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లో ఇన్నర్ రింగ్‌రోడ్ నుంచి సుఖీ శ్రీ సుమేరు మీదుగా డీ మార్ట్ వాటర్ ట్యాంక్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్ వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డుకు రీకార్పెటింగ్ పనులు చేపట్టనున్నారు.
2. రూ.1.98 కోట్లతో మరో రహదారి అభివృద్ధి: ఫేజ్-2లోని వాసవి క్రౌన్ ఈస్ట్, సుఖీ శ్రీ సుమేరు లేన్ల సమీపంలో దెబ్బతిన్న బీటీ రోడ్డుకు రీకార్పెటింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులకు కలిపి రూ.5.86 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆయా ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి మెరుగుపడనుంది. రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

మన మీ వార్త



## అమ్మమ్మ కు 100వ జన్మదినోత్సవం తెలిపిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 23, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



అమ్మమ్మ(గందె కళావతి) 100వ జన్మదినోత్సవం సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒక శతాబ్దపు జీవన ప్రయాణం అనేది ఎంతో గొప్ప విషయమని, వందేళ్ల జీవితంలో ఎన్నో అనుభవాలు, మధుర జ్ఞాపకాలు, కుటుంబ విలువలు, ప్రేమానురాగాలు ఇమిడి ఉంటాయని పేర్కొన్నారు. అమ్మమ్మ తన జీవిత ప్రయాణంలో కుటుంబ సభ్యులకు అందించిన ప్రేమ, ఆప్యాయతలు, విలువలు,ఆశీర్వాదాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో అమ్మమ్మ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని, ఆమె ఆశీర్వాదాలు కుటుంబ సభ్యులందరికీ ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అమ్మమ్మ ఆశీర్వాదం కుటుంబానికి కొండంత అండ అని, ఆమె జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని గణేష్ బిగాల పేర్కొన్నారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన కాట సునీత--రాజేష్ గౌడ్ దంపతులు

పటాన్‌చెరు, అక్టోబర్ 23 (మీ వార్త ప్రతినిధి):



దసరా పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు కాట సునీత--రాజేష్ గౌడ్ దంపతులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, యాదమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, సంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కానిస్టేబుల్ ప్రమోద్ సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 23, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



విధి నిర్వహణలో అమరుడైన కానిస్టేబుల్ ప్రమోద్ సతీమణికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది. ఈ మేరకు గురువారం సీపీ సాయిచైతన్య నియామక ఉత్తర్వులను ప్రణితకు అందజేశారు.

విధి నిర్వహణలో భాగంగా నిందితుడి దాడిలో కానిస్టేబుల్ ప్రమోద్ మృతి చెందాడు. దీంతో అమరవీరుల కుటుంబాలను ఆదుకునే చర్యల్లో భాగంగా.. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రణీతకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అమరుడైన ప్రమోద్ కుమార్ చేసిన సేవలను స్మరించుకుంటూ.. పోలీస్ శాఖ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు.

## నవంబర్ 4న వెంకటాద్రి గుడి వద్ద దండారి దర్బార్



కాసిపేట, అక్టోబర్ 23 (మన మీ వార్త మండల ప్రతినిధి) :

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని చల్లవాగు వెంకటాద్రి గుడి వద్ద నవంబర్ 4న దండారి దర్బార్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో దర్బార్ తేదీని ఖరారు చేయడంతో పాటు నూతన నిర్వహణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిర్ణయం ప్రకారం నవంబర్ 3వ తేదీ మంగళవారం సాయంత్రం మండలంలోని అన్ని దండారి బృందాలు వెంకటాద్రి గుడికి చేరుకోనున్నాయి. నవంబర్ 4వ తేదీ బుధవారం దండారి దర్బార్ నిర్వహించనున్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

దర్బార్ నిర్వహణ కోసం గౌరవ అధ్యక్షుడిగా కుంరం జనార్ధన్, అధ్యక్షుడిగా రాయిసిడం రాందాస్, ప్రధాన కార్యదర్శిగా ఆడ జంగు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పెంద్రం హన్మంతును ఎన్నుకున్నారు.

ఉపాధ్యక్షులుగా మడావి అనంత్ రావు, మడావి వెంకటేశ్వర్లు, మనోహర్, ఆత్రం మహేష్, రాయిసిడం సోము, మడావి తరుణ్, పెంద్రం శంకర్‌లను, కోశాధికారిగా ఆత్రం జంగును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇతర కమిటీ సభ్యులను కూడా ఎంపిక చేశారు.దండారి సంప్రదాయాల పరిరక్షణ, సామూహిక ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దర్బార్ నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు సమావేశంలో నిర్ణయించారు.

## శాయంపేట భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన భూముల రీ సర్వే గురించిన వివరాలను సర్వేయర్, స్థానిక రైతులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐ రాజనర్సయ్య, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వొడితల ప్రణవ్..





మన మీ వార్త హుజురాబాద్ ప్రతినిధి అక్టోబర్ 23

హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు.ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణ,మండల,కమలాపూర్,వీణవంక,ఇల్లందకుంట మండలాలకు చెందిన 53 లక్షల విలువచేసే 153 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని,వారి సంక్షేమానికి ఎప్పుడు ముందుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,పట్టణ,మండలాల అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాల్లు,అన్ని గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,సీనియర్ కాంగ్రెస్,బ్లాక్ కాంగ్రెస్,యువజన,యూత్,బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ సెల్,అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శబరిమలై అయ్యప్ప పాదయాత్రకు బయలుదేరుతున్న గురుస్వాములకు ఈర్ల రాజు ముదిరాజ్ శుభాకాంక్షలు

- సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావడం అభినందనీయం -- ఈర్ల రాజు ముదిరాజ్

పటాన్‌చెరు, అక్టోబర్ 23 (మీ వార్త ప్రతినిధి):

కిష్టారెడ్డిపేట్ నుంచి 1,300 కిలోమీటర్ల పాదయాత్ర.. అక్టోబర్ 24న ప్రారంభం

పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్ గ్రామం నుంచి శబరిమలై శ్రీ అయ్యప్ప స్వామి దర్శనార్థం పాదయాత్రకు బయలుదేరుతున్న గురుస్వాములకు బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.తెల్లాపూర్‌కు చెందిన శ్రీకాంత్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో, మాజీ ఎంపీపీ దండ్ల సునీత సత్యనారాయణ కుమారుడు దండ్ల కిరణ్ కుమార్ గురుస్వామి తన మిత్రులతో కలిసి అయ్యప్ప మాలధారణ చేసి సుమారు 1,300 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు సంకల్పించారు. ఈ పాదయాత్ర అక్టోబర్ 24వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు కిష్టారెడ్డిపేట్‌లోని దుర్గామాత ఆలయం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో గురుస్వాములు



ఈర్ల రాజు ముదిరాజ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, అయ్యప్ప మాలధారణ అనేది కేవలం ఆచారం మాత్రమే కాదని, భక్తి, నియమనిష్ఠలు, ఆత్మనిగ్రహం, సమానత్వం, సోదరభావం, సేవాభావం వంటి ఉన్నత విలువలను నేర్పించే పవిత్రమైన ఆధ్యాత్మిక మార్గమని పేర్కొన్నారు.చిన్న వయసులోనే అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తి విశ్వాసాలతో సుమారు 1,300 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధం కావడం గొప్ప విషయమని అన్నారు. సనాతన ధర్మంపై గౌరవంతో, భక్తిమార్గంలో యువత ముందుకు సాగడం అభినందనీయమని, ఇలాంటి ఆధ్యాత్మిక యాత్రలు సమాజానికి, ముఖ్యంగా యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.అయ్యప్ప దీక్ష ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, సహనం, నిష్ఠ, సేవాభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొంటూ, గురుస్వాములందరూ "స్వామియే శరణం అయ్యప్ప" అనే నామస్మరణతో భక్తిశ్రద్ధలతో యాత్రను కొనసాగించాలని సూచించారు. కిష్టారెడ్డిపేట్ గ్రామం నుంచి సుమారు 15 మంది అయ్యప్ప మాలధారులు ఈ పాదయాత్రలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.శ్రీ మణికంఠుని దివ్య ఆశీస్సులు పాదయాత్రలో పాల్గొంటున్న ప్రతి గురుస్వామిపై, వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. యాత్ర మార్గంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా, అందరూ ఆరోగ్యంగా, క్షేమంగా శబరిమలై చేరుకుని అయ్యప్ప స్వామిని దర్శించుకోవాలని, పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి రావాలని ఈర్ల రాజు ముదిరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుల పాలిట ఆత్మీయుడిగా దేవానంద్!

పటాన్ చేరు అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి :

- పండుగ వేళ కుటుంబ సభ్యులతో కలిసి నూతన వస్త్రాల పంపిణీ
- కార్మికులను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించిన మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్..

అమీన్పూర్ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఇళ్లల్లో దసరా పండుగ ఆనందాలు నింపేందుకు మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముందుకొచ్చారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని తన



నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి నూతన వస్త్రాలను అందజేసి ఆత్మీయతను చాటుకున్నారు. సమాజ పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమించే కార్మికుల కష్టాన్ని గుర్తించి పండుగ వేళ వారిని సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించారు. ఈ సందర్భంగా ఈర్ల దేవానంద్ మాట్లాడుతూ ఎండనక, వాననక ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో కీలకమని, అలాంటి శ్రమజీవులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల కోసం చెమటోడ్చే కార్మికుల కుటుంబాల్లో పండుగ ఆనందాలు వెల్లివిరియాలనే ఉద్దేశంతో నూతన వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఈర్ల దేవానంద్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ లో నా ప్రయాణం కొనసాగుతుంది సస్పెన్షన్ ఎత్తివేతపై హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకుడు శేరీ సతీష్ రెడ్డి

- పార్టీ సిద్ధాంతాలే ముఖ్యం.. కార్యకర్తల సంక్షేమమే నా లక్ష్యం

కూకట్పల్లి అక్టోబర్ 23 మన మీ వార్త

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ చర్యల కమిటీ తన వివరణను పరిశీలించి తనకు సస్పెన్షన్‌ను అధికారికంగా ఎత్తివేయడంతో కాంగ్రెస్ నాయకుడు శేరీ సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ తనకు రాజకీయంగా పునాది అని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా టీపీసీసీ నాయకత్వానికి, క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవికి, కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతులకు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పదవులు శాశ్వతం కాదు..

పార్టీ పట్ల నిబద్ధతే శాశ్వతం. రాజకీయాల్లో పదవుల కంటే పార్టీ పట్ల నిబద్ధత, ప్రజలతో అనుబంధం, కార్యకర్తల అభిమానం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. తనను నమ్మి అండగా నిలిచిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు కోసం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అధికారం కంటే కార్యకర్తల అభిమానం తనకు గొప్ప బలమని, పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తూ ముందుకు సాగుతానని తెలిపారు. పార్టీ విజయమే లక్ష్యంగా ముందడుగు వేస్తానని, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, స్థానిక నాయకత్వం, జిల్లా కాంగ్రెస్ కమిటీతో సమన్వయంగా పనిచేస్తానని ఆయన వెల్లడించారు.




TELANGANA PRADESH CONGRESS COMMITTEE

To
Sri Sheri Satish Reddy,
Former President,
Kukatpally Town Congress Party.

Sub: Revocation of Suspension Order – Reg.

The Disciplinary Action Committee (DAC) of the Telangana Pradesh Congress Committee (TPCC) has carefully examined the explanation submitted by you on 01.10.2026 and decided to revoke your suspension.

You are hereby advised to adhere to the party's discipline and guidelines and to work in close coordination with the local Congress leaders and the District Congress Committee (DCC) President to strengthen the party and prepare for the forthcoming elections.

Shyam Mohan Anantula
Vice Chairman, DAC-TPCC

(Dr. MALLU RAVI, MP)
Chairman,
TPCC - DAC

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేతతో కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రయాణం మరింత ఉత్సాహంగా కొనసాగుతుందని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## భువనేశ్వర్‌లో జాతీయ పట్టణ సదస్సుకు కమిషనర్ వెంకన్న

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

**జిడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 23:** ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో అక్టోబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న 2వ జాతీయ పట్టణ సదస్సు--2026కు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న హాజరుకానున్నారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి ఆయనను సదస్సుకు నామినేట్ చేశారు.

ఈ సదస్సులో తెలంగాణలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. పట్టణాభివృద్ధి, నీటి నిర్వహణ, వ్యర్థాల నియంత్రణ, మౌలిక సదుపాయాలు, మెరుగైన పౌర సేవలపై జరిగే చర్చలు వరంగల్ నగర అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి.



# వడ్డేపల్లి రాజేశ్వరరావు సహకారంతో శక్తి నగర్‌లో మట్టి రోడ్డు నిర్మాణం.





**కూకట్పల్లి అక్టోబర్ 23 మన మీ వార్త**

ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి నగర్‌లో వైట్ వాటర్ అపార్ట్మెంట్స్ వద్ద గత 15 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో తాత్కాలిక పరిష్కారం లభించింది.గత వారం రోజుల క్రితం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, స్థానిక డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను తొలగించేందుకు కృషి చేసి స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తనవంతు పూర్తి సహకారం అందించారు. ఈ నేపథ్యంలో, డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతనంగా నిర్మించిన మట్టి రోడ్డును ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలకు ఈ రోడ్డు నిర్మాణం కొంత ఉపశమనం కలిగించింది.రోడ్డు ప్రారంభంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులో కూడా తమ పూర్తి సహకారం అందిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు కి అండగా ఉంటామని వారు తెలిపారు.

వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ "ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం మనందరి బాధ్యత. గత 15 సంవత్సరాలుగా రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణానికి సహకరించి. ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశామని తెలియజేస్తూ. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని.శక్తి నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని" రోడ్డు నిర్మాణంలో డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మరియు మిగతా నాయకుల కృషిని అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూకట్ పల్లిలో కాషాయ జెండా ఎగరేస్తామని వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు.
డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మహిళా మోర్చా నాయకులు విజయ భవాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, ఓబీసీ మోర్చా జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్,బిజెపి సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య, జీవన్, శేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, ఈ.సాయి మరియు స్థానిక డివిజన్ నాయకులు రాజేందర్ గౌడ్ (బబ్లు), మనోజ్, శ్రీనివాస్ చారి, కృష్ణ యాదవ్, చక్రవర్తి వంశీ నేత కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ కళాశాల విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ

**కాసిపేట, అక్టోబర్ 23(మన మీ వార్త మండల ప్రతినిధి) :**

దసరా సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కాసిపేట తెలంగాణ మోడల్ కళాశాల విద్యార్థులు వృత్తి విద్యలో శిక్షణ పొందారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ విభాగాల్లో నిర్వహించిన పది రోజుల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు.

కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మందమర్రి పట్టణంలోని శ్రీనివాస హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ యజమాని పాలకుర్తి నరేష్ కుమార్ సహకారంతో ఈ శిక్షణ అందించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ వృత్తి విద్యా శిక్షకుడు పి. అశోక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం




కొనసాగింది.

తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఇంటర్న్‌షిప్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, శిక్షకుడు అశోక్ తెలిపారు. శిక్షణలో భాగంగా ఫ్యాన్లు, సింగిల్ ఫేజ్ మోటార్లు, కూలర్లు, మిక్సర్లు తదితర విద్యుత్ పరికరాల పనితీరు, మరమ్మతు విధానాలు, అంతర్గత భాగాలు, మోటార్ స్టార్టర్ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

శిక్షణ ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక నైపుణ్యాలను నేర్చుకున్నారని, కార్యక్రమం పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన ఏఐఎస్ఈసీటీ సంస్థకు, వృత్తి విద్యా సమన్వయకర్త సాంబశివరావుకు శిక్షకుడు పి. అశోక్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్నూరుకాపుల ఐక్యత కోసమే 'దసరా సమ్మేళనం'

**(మన మీ వార్త న్యూస్ఈ : అక్టోబర్ 23, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

మున్నూరు కాపుల ఐక్యత కోసమే దసరా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు మాజీ మేయర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ అన్నారు. జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని ప్రగతినగర్? మున్నూరుకాపు సంఘంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.పండుగ డెకర్ కొనండి జిల్లా నలుమూలల నుంచి..

ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మున్నూరు కాపులు విచ్చేశారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మహిళలు, పురుషులకు, పిల్లలకు మ్యూజికల్ చైర్?గేమ్ ఆడించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలరని ఆలోచించి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమ్మేళనంతో పరిచయాలు పెరిగి, ఒకరికొకరు సహాయ



సహకారాలు పెరుగుతాయన్నారు. మాజీ మంత్రి దివంగత ధర్మపురి శ్రీనివాస్ సంఘం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. మున్నూరు కాపులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు సంఘ భవనాలు నిర్మించారని గుర్తు చేశారు.

**అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత..**

తాను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత వనభోజనాలు ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో.. మొదటిసారి దసరా సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేశ్వర్, దారం సాయిలు, కోశాధికారి ధర్మపురి సురేందర్, బంటు రాజయ్య,



ఆకుల రమేష్, దారం సాయిలు, అర్జున్ ప్రకాష్, మెండి సంతోష్, అబ్బాయి లింబాద్రి, రేంజర్ల గంగాధర్, ప్రతాప రుద్ర, కోరడి కిరణ్, బండారి జగదీష్, మిద్దె రవికుమార్, దారం పోతన్న, వరాల రాజేందర్, అంగిరేకుల సాయిలు, సుదం శ్రీనివాస్, సుగంధం శ్రీనివాస్, ఎండల సంతోష్, కోడపూ శరత్, బంటు కిషోర్, శిల్ప హన్మాండ్లు, బాబురావు, బుడుగు కిషన్ రెడ్డి, ముత్యాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సుదం సాయన్న, పంచరెడ్డి శ్రీకాంత్ , బొబ్బిలి నర్సయ్య, జెట్టి గోవింద రాజు, ప్రేమ్, బైరీ శేఖర్, కర్క రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, భూమేష్ పాల్గొన్నారు.

# హనుమకొండ టిబీ రహిత సమాజానికి కృషి చేయాలి

**- టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి**

**- జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్**

**- దేశవ్యాప్తంగా టీబీ నిర్మూలనపై చేపట్టే కార్యక్రమాలపై జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య, ఎన్సీసీ అధికారులతో సమన్వయ సమావేశం**

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

టిబీ రహిత సమాజానికి కృషి చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధనా పట్నాయక్ అన్నారు.
శుక్రవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్సీసీ అధికారులతో దేశవ్యాప్తంగా టీబీ నిర్మూలనపై చేపట్టే కార్యక్రమాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టిబీ) నిర్మూలనకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, టిబీ రహిత గ్రామాల



సంఖ్యను పెంచాలన్నారు.
టిబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక దగ్గు, తదితర టిబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి మండలంలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో జోష్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజల్లో టిబీ లక్షణాలున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఈ బృందాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు , మై భారత్ వాలంటీర్లను భాగస్వాములను చేసి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.
టిబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం కూడా వ్యాధి నియంత్రణలో కీలకమని తెలిపారు. సామాజిక



బాధ్యతలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ సంస్థల సహకారంతో టిబీ బాధితులకు పోషకాహార కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ఇప్పటికే 25 గ్రామాలు టిబీ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.
గ్రామాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతంగా నిర్వహించాలని, బాధితులకు పూర్తిస్థాయి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబర్ నెలలోనే మరికొన్ని గ్రామాలను టిబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఎన్సిసి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి భూముల రీసర్వేను వేగవంతం చేయాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భూముల రీ సర్వే ను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా





కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు.

శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రోవర్ ద్వారా భూముల రీ సర్వే చేస్తుండగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో ఎన్ని ఎకరాల భూమిని రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని రీ సర్వే చేయాల్సి ఉందనే వివరాలను భూములు కొలతలు శాఖ ఏడి నూర్ సింగ్, సర్వేయర్ విజయభాస్కర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే చేస్తుండగా పక్కన భూములు ఉన్న రైతులు ఉంటున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. రైతులు హద్దులు చూపిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతులు వేసిన వరి పంటను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఏఏ పంటలు వేశారు, పంటలు ఏయే దశల్లో ఉన్నాయని స్థానిక రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి ఎన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతుందని ఏఈఈ లక్ష్మణ్ నాయక్ ను కలెక్టర్ అడిగారు. సబ్ స్టేషన్ పనులు, ఇతర మరమ్మతులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. రబీ సీజన్ లో ఏఏ పంటలు వేయనున్నారనే వివరాలను స్థానిక రైతులను, ఏఈఓ నాగరాజును కలెక్టర్ అడగగా జొవారు (జొన్న )పంట వేసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వే ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో స్థానిక రైతులు సహకరించాలని సూచించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలి: కమిషనర్ టి. వెంకన్న

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



**జీడబ్ల్యూఎంసీ: 23 అక్టోబర్ 2026 :** గ్రేటర్ వరంగల్ నగరంలో తడి, పొడి చెత్తను వేరు చేసిన అనంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.
శుక్రవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, ఆస్కి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణపై సమీక్షించారు. వ్యర్థాల ప్రాసెసింగ్‌కు ఆధునిక విధానాలను అనుసరిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేందర్, ఆస్కి ప్రతినిధి రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తౌటం ఝాన్సీరాణి - రవీందర్.

**మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 23**

ఈరోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు గారి చేతుల మీదుగా కమలాపూర్ మండలానికి సంబంధించిన 29 మంది లబ్ధిదారులకు Rs 8,91,500/-విలువ గలిగిన CMRF చెక్కులను పంపిణీ





చేయనైనది. ఈ సందర్భంగా పేద ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ప్రజలందరూ అండగా నిలబడాలని కోరనైనది. ఈ కార్యక్రమంలో బాలసాని రమేష్, మాజీ ఎంపీపీలు మాట్ల రమేష్, తడక శ్రీకాంత్, పోడేటి బిక్షపతి, బొల్లం రాజరెడ్డి, మొండెద్దుల నాగరాజు, పుల్ల శోభన్, నాంపల్లి ప్రభాకర్, మార్కెట్ డైరెక్టర్లు ఆకినపల్లి బిక్షపతి, జనగాని శివకృష్ణ ,మిల్కూరి శ్రీనివాస్, గూడెపు మొగిలయ్య, నల్లాని సురేష్, గణేష్,బాలాపూర్ కనక రత్నం తిప్పారపు యుగేందర్ బెజ్జంకి రాజు వసంతారావు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మనపల్లి గ్రామంలో భూ భారతి రీ సర్వేలో భాగంగా అవగాహన సమావేశం

**మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 23**

ఈరోజు హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో భూ భారతి రీ సర్వే లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించడం





జరిగింది. ఇట్టి సమావేశాన్ని ఉద్దేశించి ఏడి కిషన్ రావు సార్ గారు మరియు ఆర్డీవో జల కుమారి గారు భూ భారతి రీ సర్వే కు సంబంధించిన సమాచార నియమ నిబంధనలు గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది..ఈ కార్యక్రమంలో శ్రీయుత ఆర్డిఓ జల కూమారి హుజరాబాద్ గారు, ఏడి కిషన్ రావు సార్ గారు డిఐ వెంకటరత్నం గారు ఎమ్మార్వో నరేందర్ సార్ గారు మరియు గ్రామ సర్పంచ్ అన్నాడి మాధవి గారు,మాందాడిపల్లి గ్రామ సర్పంచ్ వేల్పుల విజయ పంచాయతీ కార్యదర్శి బుర్ర విజయ్ కుమార్ గారు మరియు జిపిఓ నేరేళ్ళ అనూష గారు గ్రామ కారోబార్ పొద్దుటూరి మధుకర్ రెడ్డి గారు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గాజర్ల అశోక్ అన్న కు పరామర్శ..

- మహమ్మద్ అక్రమ్ యూత్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు

టేకుమట్ల అక్టోబర్ 23 (మన మీ వార్త ) :



టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ఇటీవల అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోవడం జరిగింది.వారి నివాస లో యూత్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మమ్మద్ అక్రమ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.వారితోపాటు బండమీది కుమార్, కన్నూరి నవీన్, ఉల్లి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.10 మంది పట్టివేత!

పటాన్ చేరు అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి :

- ఆర్‌సీపురం ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు..
- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక





బీరంగూడడివిజన్ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. బీరంగూడలోని శివాలయం చౌరస్తా వద్ద ఆర్‌సీపురం ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిని గుర్తించినట్లు సీఐ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని సీఐ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు.

## బైక్ చోరి కేసులో.. ఇద్దరు నిందితులు అరెస్ట్ ..

- 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వాహనదారులు బైకులను సురక్షిత ప్రాంతాలలో పార్కింగ్ చేయాలి - సీఐ జలంధర్ రెడ్డి



బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 23 (మన మీ వార్త):



ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 11 ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితులు, డూప్లికేట్ తాళాల సాయంతో ఇళ్ల వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో నిలిపిన ద్విచక్ర వాహనాల తాళాలు తెరిచి చోరీలకు పాల్పడేవారు. వరుస చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ, స్థానిక సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు బోడుప్పల్ కమాన్ వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన అరవింద్ కుమార్ ఉపాధ్యాయ్ అలియాస్ రాజు (56), యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన తుంగా మధు (29) లుగా ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అరవింద్ బైక్ లను చోరీ చేసి మధుకు అప్పగించేవాడని, మధు వాటిని తనకు తెలిసిన వ్యక్తులకు విక్రయించేవాడని వెల్లడించారు. ఈ కేసులో నిందితులను అక్టోబర్ 22న అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్ కు తరలించారు. కేసులపై దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు. వాహనదారులు తమ బైకులను సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని నాణ్యమైన తాళాలు, పరికరాలు వినియోగించాలని అనుమానస్పద వ్యక్తులు లేదా వాహన చోరీల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఇన్స్పెక్టర్ డి. జలంధర్ రెడ్డి తెలిపారు.

## ములుగు జిల్లా గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో సోలార్ లైట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అనుమతుల కోసం పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హనుమకొండ వీవో భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :





హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వీబీ-జీ రామ్ జీ, స్వచ్ఛ భారత్ మిషన్, వీవో భవనాల నిర్మాణ పనులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం హనుమకొండ జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాలలో గ్రామ సమాఖ్య (వీవో )భవనాల నిర్మాణపనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వీబీ-జీ రామ్ జీ, స్వచ్ఛ భారత్ మిషన్, వీవో భవనాల నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో వీబీ-జీ రామ్ జీ పథకం అమలు తీరు, చేపట్టిన పనుల పురోగతి, వాటికి సంబంధించిన వివరాలను సమీక్షించారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న పారిశుధ్య కార్యక్రమాల పురోగతిని, గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు గ్రామ సమాఖ్యల (వీవో) భవనాల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సమాఖ్య భవనాల ఏర్పాటుకు సంబంధిత గ్రామపంచాయతీ తీర్మానం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో వీవో భవనం ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు కావాల్సిన జీపీ తీర్మానం, సరైన స్థలం గుర్తింపు, ప్రతిపాదనలను అందజేయాలన్నారు. వివిధ గ్రామాలలో ప్రారంభమైన వీవో భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వీవో భవన నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమీక్షా సమావేశానికి జడ్పీ సీఈఓ/ స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ రాజ్ గోపాల్ రావు, అడిషనల్ డీఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, పంచాయతీరాజ్ డీఈలు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా సర్పంచ్ మెంటేపల్లి రాములు

- మంద బాలయ్య కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన సర్పంచ్
- ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా - మెంటేపల్లి రాములు భరోసా
- బాధిత కుటుంబానికి భరోసా - మానవత్వాన్ని చాటుకున్న సర్పంచ్
- ఆపదలో అండగా ఉంటా - బాధిత కుటుంబానికి సర్పంచ్ మెంటేపల్లి రాములు భరోసా!

వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 మీ వార్త :





మెంటెంపల్లి న్యూస్ : మానవత్వమే మిన్న కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అనే నినాదాన్ని ఆచరణలో చూపించారు సర్పంచ్ మెంటేపల్లి రాములు. కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆపద సమయంలో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.గుండెపోటుతో మంద బాలయ్య మృతి, మంద బాలయ్య నిన్న రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మెంటేపల్లి రాములు ఈరోజు బాలయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. బాధను దిగమింగుకొని మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.

**బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం...**

కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న సర్పంచ్ మెంటేపల్లి రాములు తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా మెంటేపల్లి రాములు మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

**పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు...**

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ రాజమూర్ రాజయ్య, వార్డు సభ్యుడు విజయ్, అల్లి బాబు, నాయకులు తిరుమలకొండ తదితరులు పాల్గొని మంద బాలయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు మనోధైర్యాన్ని అందించిన సర్పంచ్ మెంటేపల్లి రాములు తో పాటు గ్రామ ప్రజలు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# అంగన్‌వాడీ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పనితీరును మెరుగుపరచాలి -- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :






జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడంతో పాటు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీ-స్కూల్ విద్య, మహిళా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఐసీడీఎస్ పరిధిలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ అధికారితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ప్రీ-స్కూల్ విద్య, చిన్నారుల ఆరోగ్యం, మహిళలు, శిశువుల సంరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.

సెప్టెంబర్ నెలలో సూపర్‌వైజర్లు నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలను సమీక్షించిన కలెక్టర్, రాబోయే రెండు నెలల్లో జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని తప్పనిసరిగా సందర్శించి, లోపాలను గుర్తించి పనితీరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవోలను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ పిల్లల హాజరును పెంచాలని, అంగన్‌వాడీ టీచర్లు ప్రీ-స్కూల్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పిల్లలను కేంద్రాలకు తీసుకురావడంలో అంగన్‌వాడీ ఆయాలు చొరవ చూపాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని 447 స్నేహ క్లబ్‌లలో 4,000 మందికి పైగా కిశోర బాలికలు ఉన్న నేపథ్యంలో, సూపర్‌వైజర్లు ఆయా క్లబ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

వికలాంగుల అవసరాలను గుర్తించి, అర్హులైన చిన్నారులను భవిత కేంద్రాలకు అనుసంధానం చేయాలని కలెక్టర్ తెలిపారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎం సిబ్బంది సమ్మె నేపథ్యంలోనూ ఏ చిన్నారికి టీకాలు మిస్ కాకుండా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో గృహ సందర్శనలు సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సంరక్షణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అధిక ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాగునీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.

ఎండ తీవ్రత నుంచి చిన్నారులను రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, పోషకాహార సరఫరా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సంబంధిత సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# కొత్తపేటలో భూ రీసర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ సుమ, తహశీల్దార్ శ్రీకాంత్

- క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ పురోగతిపై అధికారుల ఆరా

మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



వరంగల్ జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను - పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు.

ఇందులో భాగంగా శుక్రవారం వరంగల్ ఆర్డీఓ సుమ, వరంగల్ తహశీల్దార్ శ్రీకాంత్ లు కొత్తపేట గ్రామాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలో రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములకు సంబంధించిన వివరాల సేకరణ, భూ సరిహద్దుల గుర్తింపు, రీసర్వేకు సంబంధించిన ఇతర అంశాలను ప్రస్తుత పరిస్థితిని రైతుల నుంచి తెలుసుకున్నారు.

భూ రీసర్వే ద్వారా భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు భూ సరిహద్దుల విషయంలో పారదర్శకతను పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడం, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు అవకాశం లేకుండా చూడటం ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమన్నారు.

ఈ రిసర్వే లో ఆర్డీవో వెంట రెవెన్యూ మరియు లాడ్ సర్వే రికార్డ్స్ అధికారులు, సర్వేయర్లు రైతులు ఉన్నారు.

# వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ..

**- రూ.382 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు అనుమతులుమంజూరు - ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి**

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా, నగర అభివృద్ధికి రూ.382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు కుడా కు మంజూరు చేయడం పట్ల కుడా చైర్‌పర్సన్ శ్రీమతి గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారికి కుడా, వరంగల్ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ చారిత్రక వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ అనుమతులు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.



కుడా ఆధ్వర్యంలో వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్ ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల్లో అభివృద్ధి పనులు, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులు నగరానికి కొత్త రూపురేఖలను తీసుకురానున్నాయని తెలిపారు.

వీటితో పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, వాణిజ్య కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ అభివృద్ధి ప్రాజెక్టుల నిధుల మంజూరికి సహకరించిన ఇన్‌చార్జి మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి, రాజ్యసభ ఎంపీ శ్రీ వేం నరేందర్ రెడ్డి గారికి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారికి, కుడా వైస్ చైర్‌పర్సన్‌కు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ గారికి గుండు సుధారాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల నగర అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలమని పేర్కొన్నారు.

"వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి గారు చూపుతున్న ప్రత్యేక చొరవ నగర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోందని, నగరానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా కీలక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయడం పట్ల వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని.

ఈ ప్రాజెక్టులు సాకారమై వరంగల్ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన నగరంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తెలిపారు.

# జనగామ ఎల్‌నినో ప్రపంచవ్యాప్త ప్రభావాలపై ప్రజలను చైతన్య పర్చాలి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు







**- రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి**

**- సమాచార, పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేయాలి**

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఎల్‌నినో ప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై చూపే ప్రభావం, వాటి వల్ల తలెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్య పర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఎల్‌-నినో చూపే ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు.

శుక్రవారం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులకు నిర్వహించిన ఒకరోజు చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోందని, దాని ప్రభావాలను ఎదుర్కొనేందుకు ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎల్‌-నినో ప్రభావంతో రాష్ట్రంలో 20 శాతానికి పైగా వర్షపాతం తక్కువగా నమోదయిందన్నారు. దీంతో దాదాపు 20 శాతం పంట విస్తీర్ణం తగ్గిందని, తద్వారా సరిపడా ధాన్యం, పశుగ్రాసం తగ్గిందని తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో కేవలం 30 నుంచి 40 శాతం నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రానున్న జులై మాసం వరకు తాగు నీటికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని వివరించారు. గత మూడు నెలలుగా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరుగుతోందని, అత్యధికంగా 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని వెల్లడించారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణానికి ఈ ప్రచారాన్ని విస్తరించి, ప్రజలందరికీ ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్ డోర్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ, జానపద కళారూపాల ప్రభావం గ్రామీణ ప్రజలపై గణనీయంగా ఉంటుందన్నారు.

తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ సందేశాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా పౌరసంబంధాల అధికారులు (డీపీఆర్వోలు), తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని చేరవేసి, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నీటిని, విద్యుత్ ను అత్యంత పొదుపుగా వాడడం, ఎండల సమయంలో తగినంత నీరు తాగడం, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండడం, వృద్ధులు, చిన్నారులు, ఇతర సున్నిత వర్గాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించడం, నీటి వనరులను సమర్థంగా నిర్వహించడం, నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన సూచనలు, హెచ్చరికలు నిరంతరం చేరేలా వ్యవసాయ, విద్యుత్, పశు సంవర్ధక, రెవెన్యూ, విపత్తు నిర్వహణ, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ప్రచార కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎ. నరసింహ రెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, శ్రీనివాస్, మధుసూధన్, వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమాచార పౌరసంబంధాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించండి. ఉద్యమకారుల జాబితాలో చేర్చి తగిన విధంగా గౌరవించండి

**- తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ కే.కేశవరావు గారికి జర్నలిస్టుల బహిరంగ లేఖ...**

**మన మీ వార్త అక్టోబర్ 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మహా ఉద్యమం లో జర్నలిస్టుల పాత్ర కీలకమైంది. నిప్పు రవ్వలాంటి ఉద్యమానికి ఊపిరిలూదింది జర్నలిస్టులు. ఆంధ్రా, తదితర ప్రసార మాధ్యమాల యాజమాన్యాలకు నచ్చక పోయినా ఉద్యోగాలను పణంగా పెట్టి మా నిధులు,మా నీళ్లు,మా ఉద్యోగాలు(నియామకాలు) మాకే (తెలంగాణ ప్రజలకే) దక్కాలనే బలమైన కోరిక తో జర్నలిస్టులు రోడ్డెక్కి కలం కవాతులు ,రాస్తారోకోలు చేశారు. నిరసనలు తెలిపారు,ధర్నాలు చేశారు. దీక్షలు చేశారు.టెంట్ వేసుకుని మొదట వరంగల్ చౌరస్తా లో వరంగల్ తూర్పు జర్నలిస్టులు దీక్షలు చేశాక..ఆ స్ఫూర్తి తో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు దీక్షలు చేశారు. ఉద్యమం లో జర్నలిస్టులు ఇది ప్రత్యక్షంగా చేసింది...

ఇక పరోక్షంగా చేసింది. ఉద్యమం చల్లారకూడదని, రాష్ట్రాన్ని ఇప్పుడు సాధించుకోక పోతే ఎప్పుడూ సాధించుకోలేమని జర్నలిస్టులు కంకణం కట్టుకున్నారు. ఉద్యమం అనే వాహనం లో ప్రచారమనే ఇంధనం నింపి రాకెట్ స్పీడ్ తో ముందుకు దూసుకుపోయేలా చేసింది జర్నలిస్టులు...

కుల,మతాలకు అతీతంగా అందరిని రోడ్లెక్కి తెలంగాణ కోసం నినదించేలా చేసింది జర్నలిస్టులు. ఆడ ,మగ,



2009 లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమానికి మద్దతుగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పనిచేసే జర్నలిస్టులు వరంగల్ చౌరస్తాలో దీక్షలు నిర్వహించిన దృశ్యాలు

విద్యార్థి, యువత,కార్మికులు,కర్షకులు, వృద్ధుల,పెన్షనర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను, మహిళా సంఘాలను,కులసంఘాలను,వ్యాపార వాణిజ్య,పరపతి సంఘాల కు ప్రాధాన్యత ఇచ్చి తమతమ ప్రసార, ప్రచూరణల ద్వారా ఉద్యమానికి ఊపిరి పోయడం జరిగింది.

వాళ్ళు చేసిన చిన్న కార్యక్రమాని సైతం బూతద్దం లో పెట్టి పెద్ద కార్యక్రమంగా చూపి ఆనాటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వణుకు పుట్టించేలా చేసింది. రాష్ట్ర సాధనకు తోడ్పడింది జర్నలిస్టులు. ( పోలీసులకు జర్నలిస్టులకు మధ్య ఉన్న పరిచయాలు,అనుబంధం వల్ల కేసులు నమోదు కాలేదు. కానీ నిజంగా పోలీసులు కేసులు పెట్టాలనుకుంటే జర్నలిస్టుల పైనే ఎక్కువ కేసులు పెట్టేవారు)

తెలంగాణ ఉద్యమానికి,ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇంత కృషి చేసిన జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించకపోవడం దురదృష్టకరం. పోలీసు కేసులు, జైలు జీవితం లేవనే నెపం తో జర్నలిస్టులను పక్కన పెట్టడం బాధాకరమైన అంశం. ( ప్రభుత్వం పెట్టిన ఈ నిబంధన నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలి)

ప్రసార సాధనాలు లేకుండా, జర్నలిస్టుల సహకారం లేకుండా ఏ ఉద్యమం విజయతీరాలను చేరిన దాఖలు చరిత్రలో లేవు. ప్రతీ ఉద్యమ కారుడికి సహకారం అందించింది జర్నలిస్ట్.

ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి గారు,ఉద్యమ కారుల కమిటీ చైర్మన్ కేశవరావు గారు(ఆయనది జర్నలిస్ట్ నేపథ్యమే కనుక) జర్నలిస్టుల బాధను ఆలకించి, 2000 నుంచి 2014 వరకు జర్నలిస్టుగా పని చేసిన వారిని గుర్తించి ఉద్యమకారుల జాబితాలో చేర్చి తగిన విధంగా గౌరవించాలని నా విన్నపం. డిమాండ్.

## జిల్లా ఏడి కిషన్ ఆధ్వర్యంలో రిసర్వే పై అవగాహన సదస్సు.





**మనోహరాబాద్ అక్టోబర్ 23 మన మీ వార్త ప్రతినిధి.**

ధర్మరాజుపల్లి గ్రామంలో రీ సర్వేకు సంబంధించి అవగాహన కార్యక్రమంలో భాగంగా రైతుల మధ్య భూతగాదాలకు తావు లేకుండా భూమి రిసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఈ సందర్భంగా తెలిపారు భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారంతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు.

ఈ యొక్క కార్యక్రమానికి మెదక్ AD కిషన్, మనోహరాబాద్ మండల తహసిల్దార్ ఆంజనేయులు, DI అనిల్, సర్వేయర్,పాల్గొన్నారు.

## అనాథ మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు

**- మానవత్వాన్ని చాటుకున్న ఎం.డి.ఆర్. ఫౌండేషన్.. ఆర్థిక సహకారం అందించిన మాద్రి పృథ్వీరాజ్**

**పటాన్‌చెరు, అక్టోబర్ 23 (మీ వార్తా ప్రతినిధి):**



బీహెచ్‌ఈఎల్ ఎక్స్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని అనాథ మృతదేహానికి ఎం.డి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఎం.డి.ఆర్. ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్ అందజేశారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంతో పాటు, అనాథ మృతదేహాలకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించడం ద్వారా ఎం.డి.ఆర్. ఫౌండేషన్ తన మానవతా దృక్పథాన్ని చాటుకుంటోంది.

సమాజంలో ఆదరణకు నోచుకోని వారికి సహాయం అందిస్తూ, సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ కొనసాగిస్తోంది.అనాథ మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా మానవత్వం, సామాజిక సేవ పట్ల తన నిబద్ధతను ఎం.డి.ఆర్. ఫౌండేషన్ మరోసారి చాటుకుంది.

## బతుకమ్మ పండుగ సందర్భంగా కూచారం, మరియు కొనాయపల్లి గ్రామాల్లో దళితులపై దాడులు.

**-ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ విచారణ చేపట్టారు.**







**మనోహరాబాద్, అక్టోబర్ 23 మన మీ వార్త ప్రతినిధి.**

మండలంలో కూచారం మరియు కొనాయపల్లి పిటి గ్రామాలలో జరిగిన గొడవల్లో ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయడంతో ఇరు గ్రామాలలో జరిగిన గొడవల విషయంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం విచారణలో భాగంగా బతుకమ్మ పండుగ రోజు దళిత సర్పంచ్ చిత్ర రఘు ఉప సర్పంచ్ ఆంజనేయులు వర్గాల మధ్య జరిగిన గొడవ పై తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ విచారణ చేపట్టారు దళిత సర్పంచ్ చిత్ర రఘు పిర్యాదు చేయగా 6 గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్టు డిఎస్పి తెలిపారు. దళిత సర్పంచ్ ఏర్పాటు చేసిన బతుకమ్మ వద్ద కాకుండా మరో చోట బతుకమ్మ అడటానికి వెళ్లడంతో సర్పంచ్ ఇక్కడే ఆడాలంటు కోరడంతో అతని చొక్క పట్టుకొని తోపులటతో కొట్టడంతో పాటు దళితుడినే ఉద్దేశంతో కించపరిచాని ఆవేదన వ్యక్తం చేశారు.. డిఎస్పి నరేందర్ గౌడ్ ఇరువర్గాలతో రెండు గ్రామాల వారిని విడి విడిగా విచారణ చెప్పటారు. గ్రామ సర్పంచ్ పాలక వర్గం కలిసిమెలిసి ఉండాలని గొడవలతో జీవితాలు కోర్టుల చుట్టు తీరగాల్సి వస్తుందని డిఎస్పి సూచించారు. ఈ విచారణ లో మనోహరాబాద్ ఎసై సుభాష్ గౌడ్, అరుంధతీయ బంధు సేవా మండలి మెదక్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి సత్యం, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కృష్ణ మాదిగ ఎన్నెల్లి సుధాకర్ మాదిగ, బక్క శ్రీనివాస్ మాదిగ, వర్గంటి మురళి మాదిగ మెదక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మహేందర్, రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షులు సామల అశోక్ కుమార్ ఇరు గ్రామాల వారు పాల్గొన్నారు.

# విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధానమంత్రి అన్నారు. "గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది. దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి. కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి. ఈ రోజు, వాటిని పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉంది. మనల్ని విభజించాలని చూసే శక్తులకు వ్యతిరేకంగా మనం సమాజాన్ని ఏకం చేయాలి. మన పౌరుల్లో ఆత్మనిర్భరత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. ఈ లక్ష్యాల కోసం మనం మరింత చురుకుగా వ్యవహరించాలి."

వ్యక్తిగత పురోగతి అనేది జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వామి చిన్మయానంద బోధనలను, ఆధ్యాత్మిక వృద్ధిని దేశాభివృద్ధికి అనుసంధానించేందుకు ఆయన చేసిన



కృషిని గుర్తు చేశారు. 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అనే వేద మంత్రాన్ని చెబుతూ, దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

"మిత్రులారా మన వేదాలు మనకు 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అని పిలుపునిస్తున్నాయి. అంటే దేశ శ్రేయస్సును కోరుకునేవారిగా, మనం దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా తీర్చిదిద్దాలి. స్వామి చిన్మయానంద తన జీవితాంతం ఈ మంత్రాన్నే స్ఫూర్తిగా తీసుకుని జీవించారు. ఆధ్యాత్మిక విషయాల గురించి ఆయన ఎంతటి అంకితభావంతో మాట్లాడేవారో, జాతీయ అంశాల గురించి కూడా అంతే ఉత్సాహంతో, స్పష్టతతో మాట్లాడేవారు. ఎందుకంటే మన దేశమే మన సంస్కృతికి జన్మస్థానం. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానందను ఈ రూపంలో చూడటం, ఆయన హోలోగ్రాఫిక్ ప్రతిరూపంతో సంభాషించే అవకాశం లభించడంతో నేను 33 ఏళ్లు వెనక్కి ప్రయాణించినట్లు అనిపించింది. 1993లో వడోదరలో గురుదేవ్‌తో నా భేటీ, మా మధ్య జరిగిన సంభాషణలు, ఆయన చూపిన వాత్సల్యం, ఆయన ఆశీస్సులు అన్నీ ఈరోజు కళ్లముందు కదలాడాయి. ఈ అద్భుతమైన అనుభవాన్ని సాకారం చేసిన చిన్మయ మిషన్ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆ సంభాషణలో ప్రధానాంశం యువశక్తిని పెంపొందించడం, తద్వారా ఒక బలమైన, సమర్థమంతమైన భారతదేశాన్ని నిర్మించడం పైనే చర్చించాం. వారిని కలిసిన కొన్నేళ్లకే, ప్రజలు నన్ను గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారు."

భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ దేశమే మన ఉనికికి పునాది. మన ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించాలని, దానిని దేశాభివృద్ధికి ఒక సాధనంగా మార్చుకోవాలని స్వామీజీ మనకు బోధించారు. భారతీయుల్లో దేశం పట్ల ఆత్మగౌరవాన్ని నింపడమే ఆయన లక్ష్యం. ఇదే ఉద్దేశంతో ఆయన 'గీతా జ్ఞాన యజ్ఞాన్ని' ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం మన ఇతర శాస్త్రాల జ్ఞానాన్ని సామాన్య ప్రజల వరకు చేరవేశారు. ఆయన తీసుకున్న ఆ సంకల్పం ఫలితాలను ఇప్పుడు మనం చూడవచ్చు" అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

# దేశం ముందు వాస్తవాలు పెట్టండి

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైన్యంతో కొనసాగుతున్న ఘర్షణలపై ప్రధాని మోదీ, కేంద్రం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని, ఇకనైనా ప్రధానమంత్రి మోదీ దేశం ముందుకు వచ్చి అసలు వాస్తవాలు ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు. అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ×దీూ-డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

"చైనాకు ఇచ్చిన క్లీన్ చిట్‌లు చాలు. ప్రధాని మోదీ భారత్ ముందు వాస్తవాలు చెప్పాలి! మూడు ప్రశ్నలకు సమాధానాలు కావాలి: 1. జాతీయ భద్రత: అరుణాచల్ ప్రదేశ్‌లోూాూాతో ఘర్షణలు కొనసాగుతున్నాయని ×దీూ డీజీ ధ్రువీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డోక్లాం, గల్వాన్ తర్వాత మరో తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంటోందా? ఆగస్టులో టాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లపై నివేదికలు వెలువడ్డాయి. అయినప్పటికీ, కేవలం 180 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు చెబుతున్న వాచా-దమాయ్‌లో కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు జరిగి 47 రోజులు గడిచినా, ఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశ గస్తీ మార్గాలకు ఆటంకం కలిగిందా? అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగం. దేశాన్ని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారు? 2. ఆర్థిక భద్రత: గల్వాన్‌లో 20 మంది భారత సైన్యపు వీరయోధుల త్యాగం తర్వాత, చైనా దిగుమతులు 102శాతం పెరిగాయి. అదే సమయంలో చైనాతో భారతదేశ వాణిజ్య లోటు



155శాతం పెరిగి 112.16 బిలియన్? డాలర్లకు చేరింది. భారత ఎగుమతులకు చైనా ఆటంకం కలిగిస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అంగీకరిస్తున్నారు. అయినా, ప్రభుత్వం చైనా పెట్టుబడులపై ఆంక్షలను సడలిస్తూ, అర్హత కలిగిన చైనా అనుబంధ సంస్థలకు పీఎల్ఐ (ూా×) ప్రయోజనాలను పరిశీలిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కాస్తా 'ఇంపోర్ట్? ఫ్రమ్ చైనా'గా మారిందా? 3. దౌత్యపరమైన జవాబుదారీతనం: కనీసం 23 సార్లు మోదీ- జిన్?పింగ్ మధ్య సమావేశాలు, సంభాషణలు జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబల్ 25 ప్రత్యేక ప్రతినిధుల పర్యటనలు చేశారు. 36 ఔవీజజ సమావేశాలు, వరుసగా ూజూ, దీ=×జూ శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. ఈ కార్యకలాపాలు ఎలాంటి స్పష్టమైన ఫలితాలను అందించాయి? మే 2020కి ముందు భారతదేశానికి ఉన్న గస్తీ హక్కులు పూర్తిగా పునరుద్ధరించారా? మన సాయుధ దళాలపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కానీ జాతీయ భద్రతకు జవాబుదారీతనం అవసరం, అంతేగానీ దౌత్యపరమైన ఫోటో, ఆలింగన రాజకీయాలు కాదు! ప్రతిపక్షంపై దాడి చేయడానికి బదులుగా, ప్రధాని మోదీ పార్లమెంటు, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి."

### కేంద్రం వైఖరితో దేశానికి ఏమి దక్కింది : ఖేడా

అటు కేంద్రం భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు. బీజింగ్ పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి వల్ల దేశానికి ఏమి దక్కిందని ప్రశ్నించారు. ఏప్రిల్ 2020కి ముందు భారత బలగాలు ప్రవేశించిన ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ నిర్వహించగలవా అని అడిగారు. దిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖేడా మాట్లాడారు. సరిహద్దు ఉద్రిక్తతలు, వాణిజ్య సంబంధాలు, వీసా ఆంక్షలు, భారతదేశంలోకి చైనా కార్మికుల ప్రవేశం వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. "మనకు ఏమి దక్కింది? చైనా వ్యతిరేకత వల్ల మనకు ఎలాంటి హోదా లభించింది? ఏప్రిల్ 2020కి ముందు మనం గస్తీ కాసిన ప్రదేశాల్లో ఈ రోజు గస్తీ కాయగలమా? వీటన్నిటికీ బదులుగా మీరు ఏదైనా తీసుకోవాల్సింది కాదా? దేశంలోని ఎంఎస్ఎంఈలను నాశనం చేస్తారు. మీరు చైనాకు భయపడి, చైనా కోరుకున్నది ఏదైనా చేస్తారు. కేవలం చైనాకు భయపడటం వల్లే మీరు భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగిస్తూనే ఉన్నారు. మీరు తొలగించిన ప్రయాణ ఆంక్షలైనా, 99 బిలియన్ డాలర్ల నుంచి 112 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు అయినా, పరిమితం చేసిన వీసాలు అయినా, ఇక్కడికి వచ్చే చైనా కార్మికులకు, చైనా అధికారులకు మీరు అకస్మాత్తుగా మళ్లీ వీసాలను పెంచుతున్నారు. దీనివల్ల భారతదేశానికి ఏమి జరుగుతుంది? ఈ లొంగిపోవడం వల్ల మనం సాధించింది ఏమిటి?" అని ఖేడా ప్రశ్నించారు.

# భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

భారత సైన్యం అమ్ముల పొదిలోకి మరో శక్తిమంతమైన స్వదేశీ అస్త్రం చేరింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'నాగాస్త్ర-2' యాంటీ ట్యాంక్ లాయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థను భారత ఆర్మీకి అప్పగించింది. గాల్లో చక్కర్లు కొడుతూ శత్రువుల కదలికలను పసిగట్టి, ఆత్మాహుతి దాడితో యుద్ధ ట్యాంకులను తునాతునకలు చేయడం ఈ డ్రోన్ ప్రత్యేకత. రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇందులో పగలు, రాత్రి వేళల్లో నిఘా పెట్టగల అత్యాధునిక కెమెరాలను అమర్చారు. 4 కిలోల శక్తిమంతమైన ట్యాండమ్ షేప్డ్-ఛార్జ్ వార్‌హెడ్ కలిగిన ఈ ఆత్మాహుతి డ్రోన్ 650 మిల్లీమీటర్ల మందపాటి ఉక్కు కవచం కలిగిన శత్రు యుద్ధ ట్యాంకులను సైతం సులభంగా చీల్చివేయగలదు.

ఈ నాగాస్త్ర-2 డ్రోన్ ఏకధాటిగా 60 నిమిషాల పాటు గాల్లో ఎగురుతూ లక్ష్యాలను వేటాడగలదు. ఒకవేళ దాడిని విరమించుకుంటే 25 కిలోమీటర్ల పరిధిలో దీన్ని తిరిగి సురక్షితంగా వెనక్కి రప్పించి మళ్లీ వాడుకోవచ్చు. ఇక 'ఫైర్ అండ్ ఫర్‌గెట్' విధానంలో అయితే 50 కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాలను ఇది కచ్చితత్వంతో ఛేదించగలదు.



### జీపీఎస్ జామింగ్, స్పూఫింగ్‌లను తట్టుకునే జుజజవీ టెక్నాలజీ

ఆధునిక యుద్ధరంగంలో శత్రు దేశాలు ప్రయోగించే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సవాళ్లను తిప్పికొట్టేలా నాగాస్త్ర-2లో 'ఎలక్ట్రానిక్ కౌంటర్-కౌంటర్ మెజర్స్ సాంకేతికతను జోడించారు. శత్రు సైన్యం కమ్యూనికేషన్ జామింగ్, జీపీఎస్ జామింగ్ లేదా దారి మళ్లించడం వంటి ప్రయోగాలు చేసినా వాటిని తట్టుకుని నిర్దేశిత లక్ష్యాలను నాశనం చేసేలా దీన్ని తీర్చిదిద్దినట్లు సోలార్ డిఫెన్స్ సంస్థ వెల్లడించింది. సరిహద్దుల్లో శత్రువుల సాయుధ వాహనాలు, ట్యాంకులను ఎదుర్కోవడంలో నాగాస్త్ర-2 భారత సైన్యానికి కీలక అస్త్రంగా మారనుంది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ప్రకారం, నాగాస్త్ర 2 ఆగష్టులో మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో సాంకేతిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది.

ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితమే భారత సైన్యానికి 450 నాగాస్త్ర 1= లోయిటరింగ్ మందుగుండు సామగ్రిని అందించింది సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ఈ వ్యవస్థకు సంబంధించి ఇది తమ అతిపెద్ద సింగిల్-బ్యాచ్ సరఫరా అని ఆ సంస్థ పేర్కొంది. సాంకేతిక పరీక్షల అనంతరం అత్యవసర సేకరణ కింద సైన్యం ఈ ఆర్డర్‌ను ఇచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ పరీక్షల్లో నాలుగు కంపెనీలు పాల్గొన్నాయని, అయితే అవసరమైన అన్ని పారామితులను ప్రదర్శించిన ఏకైక కంపెనీ తమదేనని ూణూూ పేర్కొంది. స్వల్ప-శ్రేణి కార్యకలాపాల కోసం సైన్యం నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి నాగాస్త్ర 1= వేరియంట్‌ను రూపొందించారు. లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వాన్ని అంచనా వేయడంతో సహా, పలు ప్రత్యక్ష పరీక్షల ద్వారా ఈ వ్యవస్థ పనితీరును మూల్యాంకనం చేశామని ూణూూ పేర్కొంది. ఈ సిస్టమ్‌లను లద్దాఖ్, ఉత్తర్?ప్రదేశ్‌లోని ఝాన్సీ సమీపంలోని బబినాతో సహా వివిధ ప్రదేశాల్లో పరీక్షించారని పేర్కొంది. ప్రస్తుత యుద్ధ సమయంలో స్వదేశీంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ సైన్యానికి తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారమని కంపెనీ అభివర్ణించింది. ఖచ్చితత్వం లేదా నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఈ వ్యవస్థ ఈ సామర్థ్యాన్ని అందిస్తుందని చెప్పింది. అంతకుముందు 2025లో భారత సైన్యం సుమారు 450 నాగాస్త్ర-1= లోయిటరింగ్ మ్యూనిషన్లను కొనుగోలు చేయడానికి సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు ఆర్డర్ ఇచ్చింది.

## భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు



అమెరికా వర్క్ వీసా నిబంధనల్లో ఇటీవలి తీసుకువచ్చిన మార్పులపై ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త నిబంధనలు భారత్? వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం చేశారు. భారత్‌లో పర్యటించిన ఆయన జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలపై భారతదేశంలో నెలకొన్న ఆందోళనలను తగ్గించే విధంగా మాట్లాడారు. "ఇది భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం కాదు. ఇది కేవలం భారతదేశంపై లక్ష్యంగా చేసుకున్నది కాదు. అమెరికాకు వచ్చి పనిచేయాలనుకునే భారతీయులపై, అలాగే మా వ్యాపార సంస్థలు నెలకొల్పాలని చూస్తున్న వారిపై ఇది ప్రభావం చూపుతుంది. కానీ ఇది భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదు, ఇది ప్రపంచవ్యాప్తమైనది. అమెరికాలో వలస విధానం లోపభూయిష్టంగా ఉంది. మా వ్యాపార సంబంధిత వలస కార్యక్రమాలు చాలా సందర్భాల్లో విపరీతమైన మోసాలకు, దుర్వినియోగానికి గురయ్యాయి. వాటిని అర్థరహితంగా దుర్వినియోగం చేశారు. కాబట్టి ఈ విషయాలను పరిష్కరించాలి. అందుకే మేము వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ అవి భారతదేశాన్ని ఉద్దేశించినవి కావు. అవి ప్రపంచంలోని ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రతి దేశానికైనా వర్తిస్తాయి." ఈ చర్యలన్నీ కేవలం అమెరికన్ కార్మికులను రక్షించడం, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే ఉద్దేశించినవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. "భారత ప్రభుత్వం ఎల్లప్పుడూ భారత ప్రజలకు, ఆ దేశ జాతీయ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందని నేను ఆశిస్తున్నాను. అలాగే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్ మన ప్రజలకు, మన కార్మికులకు, మన దేశానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వబోతోందని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను." అని రూబియో తెలిపారు. అంతకుముందు ఎనిమిది ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు శాశ్వత కార్మిక సర్టిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ అమెరికా భారీ షాక్ ఇచ్చింది. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. అదే సమయంలో అమెరికా టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను కూడా ఈ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఆయా సంస్థల తరపున హెచ్-1బీ వీసాపై అమెరికా వచ్చే ఉద్యోగులు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కుదరదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఈ కంపెనీలకు సంబంధించి కొత్త వాటితో పాటు, పెండింగ్‌లో ఉన్న లేబర్ సర్టిఫికేషన్‌లను ఇకపై పరిశీలించమని కార్మికశాఖ మంత్రి కీత్ సాండర్లింగ్ ఆదేశించారు. 2009 నుంచి ఈ కంపెనీలు భారీగా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్‌లను పొందాయని, అమెరికాకు చెందాల్సిన లక్షలాది ఉద్యోగాలను లాక్కున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ముడి చమురు దిగుమతులపైనా మార్కో రూబియో స్పందించారు. వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలన్న భారతదేశ నిర్ణయం, అమెరికా ఒత్తిడి వల్ల తీసుకోలేదన్నారు. ఇది కేవలం దాని స్వంత ప్రయోజనాల కోసమే తీసుకున్నదని స్పష్టం చేశారు. ఒకే సరఫరాదారుపై ఎక్కువగా ఆధారపడటం వల్ల దేశాలు అంతరాయాలకు గురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. "భారత్? తన ఇంధన సరఫరా వ్యవస్థను వైవిధ్యంగా మార్చడంలో పురోగతి సాధించింది. అది బెదిరింపుల వల్లనో లేదా అలాంటి ఇతర కారణాల వల్లనో చేయలేదు" అని రూబియో అన్నారు.

## లైసెన్స్‌కు కొత్త రూల్స్



దేశంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్' సవరణల ముసాయిదా ద్వారా పలు విప్లవాత్మక మార్పులను తీసుకురానుంది. ఈ ముసాయిదాపై రాబోయే 30 రోజుల్లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభ్యంతరాలు, సూచనలను తెలియజేయవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది. అవేంటంటే?

### భారతీయులకు, విదేశీయులకు వేర్వేరు రంగుల్లో లైసెన్స్

ముఖ్యంగా భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సకు వీలుగా డ్రైవింగ్ లైసెన్సులపై వారి రక్త వర్గం, మొబైల్ నంబర్, అత్యవసర సంప్రదింపు నంబర్లను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు చేసిన ముసాయిదా సవరణల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (వీశీ=ు) ప్రతిపాదించింది.

### వయసు రుజువుకు నోటరీ అఫిడవిట్లు రద్దు

అలాగే వయస్సు, చిరునామా రుజువుగా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా నోటరీ ముందు ప్రమాణం చేసిన అఫిడవిట్లను రద్దు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. దరఖాస్తుదారులు గుర్తింపు, వయస్సు, నివాస రుజువుగా ఉపయోగించే పత్రాలను కూడా ముసాయిదా నిబంధనలు నిర్దేశించాయి. ఈ జాబితాలో ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ గుర్తింపు కార్డు, ఇ-రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలతో పాటు ఉన్నాయి. దీంతో పాటు లైఫ్ ఇన్సూరెన్స్ (ఎల్ఐసీ) పాలసీ పత్రాలను అధికారికంగా అంగీకరించనున్నారు. దీనివల్ల నకిలీ పత్రాల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని తెలిపింది. "లైసెన్సింగ్ అథారిటీ ద్వారా జారీ లేదా రెన్యూవల్? చేసిన ప్రతి డ్రైవింగ్ లైసెన్స్ లామినేటెడ్ లేదా పాలీవినైల్ క్లోరైడ్ (ూఎజ) కార్డు రూపంలో ఉండాలి. ఆ ఫారంలో భారతీయులు, విదేశీయులకు జారీ లేదా రెన్యూవల్? చేసిన డ్రైవింగ్ లైసెన్సుల కోసం వరుసగా వేర్వేరు ఫార్మాట్‌లు ఉండాలి." అని ముసాయిదా నోటిఫికేషన్ పేర్కొంది. ఈ కొత్త నిబంధనల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో జవాబుదారీతనం పెరగడంతో పాటు, రోడ్డు భద్రత మరింత మెరుగవుతుందని రవాణా శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

### డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు

డ్రైవింగ్ లైసెన్స్ పొందే వారి సామర్థ్యాన్ని మరింత కఠినంగా పరీక్షించేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. దీనికోసం ఆన్‌లైన్ సేఫ్-డ్రైవింగ్ ట్యుటోరియల్ అసెస్‌మెంట్‌లో పాస్ మార్కుల అర్హతను ప్రస్తుతమున్న 60 శాతం నుంచి ఏకంగా 75 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. అంతేకాకుండా, ఈ సేఫ్-డ్రైవింగ్ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు కొనసాగాలని వీశీ=ు పేర్కొంది. డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు ప్రతిపాదిత మార్పులు మదింపు అవసరాలను కఠినతరం చేసే లక్ష్యంతో ఉన్నాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

### 15 రోజుల్లోగా వివరాల మార్పు

కొత్త ప్రతిపాదనల ప్రకారం, లైసెన్సింగ్ అధికారులు పేరు, చిరునామాతో సహా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను మార్చడానికి చేసిన దరఖాస్తులను రవాణా శాఖ అధికారులు 15 రోజుల్లోగా ఆ అభ్యర్థనను ఆమోదించడం లేదా తిరస్కరించాల్సి ఉంటుంది. ఒకవేళ తిరస్కరిస్తే దానికి గల కారణాలను కచ్చితంగా తెలపాలి. అంతేకాకుండా, దరఖాస్తుదారుడి పేరు, చిరునామాతో సహా వ్యక్తిగత వివరాల మార్పు కోసం రుసుములను తొలగించాలని కూడా ప్రతిపాదించింది. అలాగే, ఆధార్ అథెంటికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే కొన్ని రకాల డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు (ఉచితం) ఇవ్వనున్నారు.

# తుమ్మిడిహెట్టిపై సీఎం గురి!

-మొదటిపేజీ తరువాయి

జిల్లాలో 2 లక్షల ఎకరాలకు తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఇటీవల సూత్రప్రాయంగా తెలిపారని సీఎం వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో తుమ్మిడిహెట్టి, డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. బ్యారేజీ 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే సుమారు 2300 ఎకరాలు, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల్లోపే ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీని నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుదాం**

దిల్లీలో కేంద్ర జల సంఘం అధ్వర్యంలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంతో తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరిగేందుకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని



ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించాలని సీఎం సూచించారు.

**ఏదుల నుంచి డిండికి నీరు లిఫ్ట్**

ఇక దక్షిణ తెలంగాణలో డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**నీటిని అందించేలా పనులు**

ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్?లు అమర్చాలని, ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా? లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనే అంశాలపై ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీనివల్ల పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు.

**పవర్ పాయింట్ ప్రజంటేషన్**

డిండికి నార్లాపూర్ నుంచి నీటిని తీసుకోవాలా? లేదా ఏదుల నుంచా అనే విషయంపై మహబూబ్?నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది? ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యే మార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు ఆదిత్యనాథ్, మాణిక్‌రాజ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఇరిగేషన్ సీఈలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. కరువు గండం!

-మొదటిపేజీ తరువాయి

గడ్డుకాలంపై ముందస్తు హెచ్చరిక

రాష్ట్రంలో రానున్న కాలంలో నీరు, విద్యుత్ కొరత సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని అన్నారు. పరిస్థితి తీవ్రతను ముందుగానే తెలియజేయడం ద్వారా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రజలు ఎయిర్ కండిషనర్ల (ఏసీ) వినియోగాన్ని తగ్గించాలని, అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆపివేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పగటిపూట అవసరం లేకుండా లైట్లు, ఫ్యాన్లు వినియోగించవద్దని అధికారులకు తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో పొదుపు చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు.

**రిజర్వాయర్లలో తగ్గిన నీటి నిల్వలు**

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉన్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో 20 శాతం కూడా నీరు లేదని, కృష్ణా జలాల లభ్యత కూడా పరిమితంగానే ఉందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు పశు సంపదను కాపాడుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత పరిమితంగా ఉన్నప్పుడు సాగునీటి సరఫరా, విద్యుత్ వినియోగాన్ని సమన్వయం



చేయడం సవాలుగా మారుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు పంటల సాగు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం**

ఎల్‌నినో ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాలపై పడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్ర వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనూ నీటి వినియోగంపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలోనూ నీటి వినియోగాన్ని నియంత్రించడంతోపాటు విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వానాకాలంలో అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో పంటల సాగుకు కొంత ఊరట లభించిందని, అయితే రాబోయే కాలంలో పరిస్థితులు మారే అవకాశాలను విస్మరించకూడదని అన్నారు. ఎండల తీవ్రత పెరిగితే ప్రజల సాధారణ జీవనంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కరవును ఎదుర్కోవడానికి ప్రభుత్వ చర్యలతోపాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని స్పష్టం చేశారు.

**రాజకీయ విమర్శలు.. ప్రభుత్వ వివరణ**

కరవు పరిస్థితులపై ప్రభుత్వం ప్రజలను ముందుగానే అప్రమత్తం చేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడే పరిస్థితులకు సంబంధించి వాస్తవాలను ప్రజలకు వివరించకుండా వదిలేస్తే ప్రతిపక్షాల ప్రచారమే ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కరవు పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నేతల సమావేశం**

అంతకుముందు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నీరు, విద్యుత్ పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు గ్రాడ్యుయేట్ స్థానాలను గెలుచుకునేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పెరుగుతున్న వాయు కాలుష్యం

వాయుకాలుష్యం దిల్లీలోనే కాదు మన రాష్ట్రంలోనూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలో ఉన్న హైదరాబాద్, నల్గొండ నగరాలతో పాటు జిల్లా కేంద్రం సంగారెడ్డిలోనూ గాలి నాణ్యత ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, రోడ్లపై ఉండే ధూళి, నిర్మాణ పనులు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

**ఈ 3 ప్రదేశాల్లోనే ఎక్కువ**

2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సగటు గణాంకాల ప్రకారం, పీఎం-10 స్థాయి జాతీయ ప్రమాణాలను మించి ఉన్నాయి. హైదరాబాద్‌లో కాలుష్య స్థాయిలు జాతీయ పరిమితి కంటే 33.3% ఎక్కువగా ఉండగా, సంగారెడ్డి, నల్గొండలలో వరుసగా 30%,18.3% అధికంగా ఉన్నాయి.

**గాలిలో పీఎం-10 స్థాయిలు ఎంత ఉండాలి?**

పీఎం-10 అనేది సూక్ష్మ కణ పదార్థాల సమూహాన్ని సూచిస్తుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాల ప్రకారం, పీఎం - 10 వార్షిక సగటు గాఢత గాలిలో క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించకూడదు. అయితే 2025-26లో హైదరాబాద్‌లో 80 మైక్రోగ్రాములు, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, పీఎం-10 వార్షిక సగటు 15 మైక్రోగ్రాములుగా ఉండాలి. ఈ ప్రమాణంతో పోలిస్తే, నమోదైన స్థాయిలు హైదరాబాద్‌లో 5.3 రెట్లు, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.



**వాయు కాలుష్యంతో దీర్ఘకాల సమస్యలు**

సూక్ష్మ ధూళికణాల సమూహం శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. వాయు కాలుష్యానికి దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల శ్వాసకోశ, హృదయ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇప్పటికే ఆస్తమా, గుండె జబ్బులు లేదా ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. అప్పటితో పోలిస్తే హైదరాబాద్‌లో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, కాలుష్య స్థాయిలు ఇప్పటికీ నిర్ణీత పరిమితుల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉన్నాయి.

## సన్న వడ్లకు భలే గిరాకీ



ఓవైపు ఎల్‌నినో ప్రభావం మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో పంట దిగుబడులపై మెదక్ జిల్లాలో ప్రతికూల ప్రభావం పడినప్పటికీ సన్న రకం ధాన్యం పండించిన రైతులకు మాత్రం మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. గతంలో వడ్లను అమ్ముకోవాలంటే కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఆ సీన్ పూర్తిగా మారింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే వ్యాపారులే నేరుగా పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసి అక్కడికక్కడే నగదు ముట్టచెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, రోజుల తరబడి ఎదురుచూసే బాధలూ తప్పాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు**

రాష్ట్రవ్యాప్తంగా సన్న వడ్లు పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది. ధాన్యం నాణ్యతగా ఉంటే చాలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన పలువురు వ్యాపారులు నేరుగా గ్రామాల్లోని పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

**క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500**

మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రేడ్-ఏ సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర పలుకుతుందని రైతులు ఆనందంతో చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు సుమారు రూ.1000 వరకు అదనంగా లభిస్తుండటంతో అన్నదాతలు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈసారి పంట దిగుబడి తగ్గినప్పటికీ ధర కొంత ఎక్కువగా వస్తుండటంతో నష్టాల బారిన పడకుండా తప్పించుకోగలిగామని చెబుతున్నారు. గతంలో వరి కోతలు మొదలైనప్పటి నుంచి రైతులకు పరీక్ష మొదలయ్యేది. ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తరలించడం. అక్కడ కుప్పలు పోసి కాంటా కోసం రోజుల తరబడి ఆరబెట్టి ఎదురుచూడటం. అకాల వర్షాలు వస్తాయేమోనని ఆందోళన చెందడం. ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడాల్సి వచ్చేది. చివరకు ధాన్యం అమ్మిన తర్వాత డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడతాయోనని బ్యాంకుల చుట్టూ తిరగడం జరిగేది. కానీ ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా మారింది. పంట కోతలు పూర్తికాకముందే వ్యాపారులే పొలాల వద్దకు చేరుకుని ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులకు ఖర్చులు కలిసోస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తప్పిందని రైతులు చెబుతున్నారు.

**బహిరంగ మార్కెట్‌లోనే అమ్మకాలు**

ఈ ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్-ఏ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న వడ్లకు దీనికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. అయితే మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు నాణ్యతకు అనుగుణంగా క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధర, బోనస్ కోసం ఎదురు చూడకుండా బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న ధరలకే రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. మొత్తానికి దిగుబడులపై ప్రకృతి ప్రభావం చూపినా, సన్న వడ్లకు పెరిగిన డిమాండ్ రైతులకు కొంత ఊరటనిస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షణకు బదులు పొలాల వద్దకే వస్తున్న వ్యాపారులు, తగ్గుతున్న అదనపు ఖర్చులు రైతుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. పంట దిగుబడి వచ్చినప్పుడు ఈ ధరలు ఉంటే రైతులకు ఆదాయం మరింత పెరిగి తమ కుంటుంబాలు ఆర్థికంగా స్థిరత్వాన్ని సాధిస్తాయని చెబుతున్నారు. అయితే ఈ డిమాండ్ ఎంతకాలం కొనసాగుతుంది? రైతులకు లభిస్తున్న ధరలు రానున్న రోజుల్లోనూ నిలకడగా ఉంటాయా? అనే అంశాలపై వేచి చూడాలి.

## ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్? ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్ రూమ్? ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలన్నీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎప్పుడైనా చూసుకునేలా యూట్యూబ్‌లో పెట్టాలన్నారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

**ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం భూములు గుర్తింపు**

ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం మొదటి విడతలో మిగిలిన నియోజకవర్గాలతో పాటు రెండు, విడతల కోసం యుద్ధప్రాతిపదికన స్థలాలు గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ టవర్లు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో భూములు గుర్తించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాలు పూర్యయ్యే వరకు ప్రతీ దశలోనూ నిర్దిష్ట కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, గృహనిర్మాణ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తదుపరి విడతలో కొత్త దరఖాస్తుదారులు**

ఇటీవల ప్రతి అపార్ట్?మెంట్?కు సంబంధించిన భూమిలో వాటాను సైతం రిజిస్ట్రేషన్?లో పొందుపరుస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. వచ్చే ఏడాది బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారికి తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని ప్రకటించారు.

## బిజినెస్

# జియో ఐపీవోకు యమ క్రేజ్..
## కోటి దరఖాస్తులు దాటిన మొదటి ఐపీఓ ఇదే..!

### కరిగిపోతున్న విదేశీ నిల్వలు
**మరో 5 బిలియన్ డాలర్లు తరిగిపోయి 721 బిలియన్ డాలర్లకు..**



**ముంబై :** విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. ఈ నెల 16తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 5.011 బిలియన్ డాలర్లు తరిగిపోయి 721.016 బిలియన్ డాలర్లకు పడిపోయినట్టు రిజర్వుబ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 8.578 బిలియన్ డాలర్లు తగ్గి 726.027 బిలియన్ డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 4న రికార్డు స్థాయి 785.706 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ నిల్వలు..గడిచిన నెలన్నర రోజుల్లో 60 బిలియన్ డాలర్లకు పైగా పడిపోయాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 5.758 బిలియన్ డాలర్లు తరిగిపోయి 591.847 బిలియన్ డాలర్లకు తగ్గడం మొత్తం రిజర్వులపై ప్రతికూల ప్రభావం చూపాయని తెలిపింది. కానీ, గోల్డ్ రిజర్వులు 706 మిలియన్ డాలర్లు ఎగబాకి 105.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ కూడా 30 మిలియన్ డాలర్లు అధికమై 18.578 బిలియన్ డాలర్లకు చేరుకోగా, ఐఎంఎఫ్ వద్ద ఉన్న నిధులు 11 మిలియన్ డాలర్లు పెరిగి 4.791 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు తెలిపింది. ప్రవాస భారతీయులు డిపాజిట్ల కోసం ప్రత్యేక రాయితీ మార్పిడిలో భాగంగా భారీగా డబ్బులు పంపించడంతో బ్యాంకులు రికార్డు స్థాయిలో దాదాపు 133 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించినప్పటికీ, అవి క్షీణత ధోరణిలో ఉన్నాయి.

### ఇన్ఫీ లాభం 7,823 కోట్లు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 :** దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.7,823 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,364 కోట్ల లాభంతో పోలిస్తే 6.2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం రూ.44,490 కోట్ల నుంచి 10.2 శాతం వృద్ధితో రూ.49,244 కోట్లకు చేరుకున్నట్టు ప్రకటించింది. మరోవైపు, మరోసారి గైడెన్స్‌ను నిరాశపరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికా ఆదాయంలో 1-2 శాతం వరకు మాత్రమే వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని అవుట్‌లుక్‌లో పేర్కొంది. గతంలో అంచనావేసిన 1.5 శాతం నుంచి 3 శాతం కంటే ఇది తక్కువ. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు విచక్షణతో చేసే ఖర్చులు తక్కువగా ఉండటం వల్లనే ఆదాయ అంచనాల్లో కోత పెట్టినట్టు కంపెనీ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ తెలిపారు. గత త్రైమాసికంలో లైఫ్ సెన్సెస్, ఎనర్జీ, యుటిలిటీ, రిసోర్స్, సర్వీసెస్ రంగాల్లో 5.2 బిలియన్ డాలర్లు విలువైన ఒప్పందాల వల్లనే ఆదాయంలో రెండంకెల వృద్ధి నమోదైందన్నారు. గత త్రైమాసికంలో సంస్థ 4,480 మంది ఉద్యోగులను తీసుకోవడంతో మొత్తం సంఖ్య 3.32 లక్షలకు చేరుకున్నారు. అలాగే వలసలు 12.7 శాతంగా ఉన్నాయి




**ముంబై :** జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీవో.. మదుపర్లకు పూనకాలు తెప్పిస్తున్నది. ఎగబడిమరీ కొనేస్తున్నారు. బిడ్డింగ్ మొదలైన తొలిరోజే (బుధవారం) దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. రెండో రోజైన గురువారం కూడా ఇన్వెస్టర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కనిపించింది. దీంతో ఇప్పటిదాకా 5.57 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. అన్ని వ్యక్తిగత విభాగాల నుంచి విశేష స్పందన వస్తుండగా.. 19.75 కోట్ల షేర్లను ఆఫర్‌కు పెడితే గురువారం సాయంత్రం 5 గంటలకల్లా 110.03 కోట్ల షేర్లకు సరిపడా బిడ్లు దాఖలయ్యాయి. షేర్ గరిష్ఠ శ్రేణి ధరతో చూస్తే.. ఈ డిమాండ్ విలువ రూ.1,23,129 కోట్లు (బుధవారం 62.36 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలవగా, దీని వాల్యూ రూ.69,800 కోట్లు)గా ఉన్నది. ఇందులో గురువారం (47.67 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి) దాఖలైన బిడ్ల విలువ రూ.53,329 కోట్లు. దీంతో యాంకర్ బుక్ బిడ్డింగ్ వాల్యూతో కలిపితే ఇది రూ.3.73 లక్షల కోట్లకుపైగానే ఉంటున్నది. సోమవారం నిర్వహించిన యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్‌లో రూ.8,110 కోట్ల షేర్లకుగాను ఏకంగా రూ.2.5 లక్షల కోట్లకుపైగా విలువైన బిడ్లు దాఖలైన సంగతి విదితమే. శుక్రవారం కూడా ఈ ఐపీవో బిడ్డింగ్ కొనసాగనున్నది.

గతంలో ప్రపంచవ్యాప్తంగా 'వారీ ఎనర్జీస్' కు వచ్చిన సుమారు 97 లక్షల దరఖాస్తుల రికార్డును బద్దలు కొట్టింది. అలాగే బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ , దీజజూ వంటి దిగ్గజ కంపెనీల కంటే జీ×ూ ×ూరా కే ఎక్కువ దరఖాస్తులు రావడం విశేషం.

ఐపీవో విలువ: రూ.30,213 కోట్లు
షేర్ ధరల శ్రేణి: రూ.1,065-1,119

ఐపీవో ముగిసే తేదీ: శుక్రవారం (అక్టోబర్ 23)
మదుపర్ల మధ్య షేర్ల కేటాయింపులు: సోమవారం (అక్టోబర్ 26)
డీమ్యాట్ ఖాతాల్లోకి షేర్ల జమ: మంగళవారం (అక్టోబర్ 27)
బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో జియో ప్లాట్‌ఫామ్స్ నమోదు: బుధవారం (అక్టోబర్ 28)
65.1 కోట్ల షేర్ల (రూ.72,898 కోట్లు)కు బిడ్లు వేసిన క్వాలిఫైడ్ సంస్థాగత మదుపర్లు (క్యూఐబీ)రెట్లు
రూ.24,330 కోట్ల విలువైన షేర్లకు బిడ్డింగ్ చేసిన సంస్థాగతేతర మదుపర్లు (ఎన్ఐఐ)
రూ.14,652 కోట్ల విలువైన బిడ్లు దాఖలు చేసిన రిటైల్ వ్యక్తిగత మదుపర్లు (ఆర్ఐఐ)
రూ.500 కోట్లకుగాను రూ.1,103 కోట్లషేర్లకు సరిపడా బిడ్లు వేసిన ఉద్యోగులు
రూ.10,107 కోట్లు దాటిన కంపెనీ ప్రస్తుత వాటాదారుల బిడ్డింగ్

### పసిడికి ఆదరణ కరువు.. మార్కెట్‌లో పడిపోతున్న ధరలు
**3 రోజుల్లో రూ.4,200 దిగిన తులం.. రూ.13,000 తగ్గిన కిలో వెండి**

క్రూడాయిల్ రేట్ల ప్రభావం



**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు క్రమేణా పడిపోతున్నాయి. గడిచిన మూడు రోజుల్లో తులం పసిడి రేటు రూ.4,200 క్షీణించగా, కిలో వెండి విలువ రూ.13,000 పతనమైంది. శుక్రవారం ఒక్కరోజే ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,900 దిగి రూ.1,46,100 (అన్ని పన్నులు సహా) వద్ద స్థిరపడిందని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక కేజీ వెండి రేటు రూ.5,500 తగ్గి రూ.2,02,000 దగ్గర నిలిచింది. గత నెల సెప్టెంబర్ 30 నుంచి వెండి ధర రూ.30,000 (13 శాతం) దిగజారడం గమనార్హం. కమోడిటీ మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ గట్టిగానే ఉందని ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. స్పాట్ గోల్డ్ ఔన్స్ 4,024.37 డాలర్లు పలికింది. సిల్వర్ 53.83 డాలర్లుగా ఉన్నది.

**హైదరాబాద్‌లో..**
హైదరాబాద్‌లోనూ గోల్డ్, సిల్వర్ రేట్లు తగ్గుముఖం పట్టాయి. 24 క్యారెట్ పుత్తడి తులం రూ.1,900 దిగి రూ.1,42,480గా నమోదైంది. ఇక 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాముల బంగారం ధర రూ.1,750 క్షీణించి రూ.1,30,600గా ఉన్నది. నిజానికి ప్రస్తుత పండుగ సీజన్‌లో మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడాల్సి ఉన్నది. కానీ దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులు.. వ్యాపారావకాశాలను బాగా దెబ్బతీస్తున్నాయని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. దీంతో వచ్చే నెల 6న ధనత్రయోదశి సేల్స్ కూడా పెద్దగా ఉండకపోవచ్చన్న అభిప్రాయాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ ధరలు తగ్గుముఖం పడుతుండటంతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారని, పండుగలు, శుభకార్యాలకు అవసరమైనంత మేరకే కొనేందుకు ముందుకు వస్తున్నట్టు చెప్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో దేశీయంగా బంగారం, వెండి ధరలు పరుగులు పెట్టాయి. ఈ క్రమంలోనే జనవరి 29న 24 క్యారెట్ తులం గోల్డ్ రేటు మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైని సృష్టిస్తూ రూ.1,83,000గా నమోదైంది. కిలో వెండి ధర కూడా రూ.4,04,500 పలికింది. కానీ దాదాపు ఈ 9 నెలల్లో బంగారం ధర రూ.37,000, వెండి రేటు రూ.2,02,500 పడిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఏర్పడిన సంక్షోభం, ఎల్ నినోతో వర్షాభావ పరిస్థితుల సెగ.. మార్కెట్‌కు గట్టిగానే తగులుతున్నది. గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 115 డాలర్లను దాటడం కూడా గోల్డ్ మార్కెట్‌ను కుదిపేస్తున్నది.

# బౌలర్లపైనే బెంగ..
# నేడు న్యూజిలాండ్‌తో భారత్ రెండో టీ20



**క్రైస్ట్‌చర్చ్ :** తమ బ్యాట్ పవర్‌తో తొలి మ్యాచ్‌లో రికార్డు టార్గెట్‌ను ఛేజ్ చేసి న్యూజిలాండ్‌పై అద్భుత విజయం అందుకున్న భారత్ రెండో పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగే రెండో టీ20లోనూ గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ముందంజ వేయాలని చూస్తోంది. అయితే, తొలి పోరులో రికార్డు స్థాయి లక్ష్యాన్ని ఛేదించినప్పటికీ.. బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. నాలుగేండ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ తన లయను అందుకోవాల్సి ఉంది. పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి వికెట్లేమీ పడగొట్టలేకపోయాడు. పవర్ ప్లేలో కివీస్ ఓపెనర్లు అలెన్, టిమ్ సిఫర్ట్ చెలరేగిపోవడంతో భారత పేసర్లు ఒత్తిడికి గురయ్యారు. స్పిన్నర్ అక్షర్ కూడా భారీగా పరుగులు సమర్పించుకోవడంతో, కెప్టెన్ శ్రేయస్ బౌలింగ్ ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఇక, తొలి మ్యాచ్‌లో గాయపడిన ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో 15 ఏండ్ల యువ సంచలనం సూర్యవంశీ ఓపెనర్‌గా తుది జట్టులోకి అరంగేట్రం చేసే అవకాశం ఉంది. ఫామ్‌లో ఉన్న శాంసన్ మూడోనంబర్‌లో, తిలక్ ఐదో స్థానంలో ఆడనున్నారు.

### ఆసియా పారా క్రీడల్లో భారత్ సరికొత్త చరిత్ర.. 114 పతకాలతో రికార్డు!

ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగిన ఈ పోటీల్లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు ఉన్నాయి. గత ఆసియా పారా క్రీడల్లో 108 పతకాలను సాధించగా.. ఈసారి ఆ రికార్డును అధిగమించి, భారత్ తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేయడం విశేషం. ఫలితంగా పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. అయితే, దక్షిణ కొరియా ప్రదర్శనను బట్టి తుది ర్యాంకులో మార్పు ఉండే అవకాశం ఉంది.

**చివరి రోజూ పతకాల వేట**
పోటీల చివరి రోజున భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేశారు. పురుషుల జావెలిన్ త్రోలో సుమిత్ ఆంటిల్ 72.46 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించాడు. ఇదే విభాగంలో మహేంద్ర గుర్జర్ రజతం, సందీప్ సర్గర్ కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల క్లబ్ త్రో ఎఫ్51 విభాగంలో ప్రణవ్ సూర్మా 32.87 మీటర్లతో ఆసియా పారా క్రీడల రికార్డు నెలకొల్పి స్వర్ణం సాధించాడు. ఈ పోటీల్లో అతడికి




ఇది రెండో స్వర్ణం. ధరంబీర్ కాంస్య పతకంతో సత్తా చాటాడు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్40/ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ 42.55 మీటర్ల దూరం విసిరి కాంస్యం సాధించాడు. పురుషుల 100 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ 11.67 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్య పతకం గెలుచుకున్నాడు. అంతకుముందు 400 మీటర్ల టీ44 విభాగంలో స్వర్ణం సాధించిన సందీప్.. ఈ పోటీల్లో రెండో పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.

**బ్యాడ్మింటన్‌లోనూ మెరుపులు**
పారా బ్యాడ్మింటన్‌లో భారత క్రీడాకారులు కీలక విజయాలు అందించారు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్లో నితేశ్ కుమార్ 21-18, 21-16తో సహచరుడు ప్రమోద్ భగత్‌పై గెలిచి స్వర్ణం సాధించాడు. ఇదే పోటీలో ప్రమోద్‌కు రజతం దక్కింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 విభాగంలో నవీన్ శివకుమార్ 21-9, 21-17తో ఇండోనేసియాకు చెందిన ఫెర్డీ సెటియావాన్‌ను ఓడించి స్వర్ణం గెలుచుకున్నాడు. మహిళల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యూ5 ఫైనల్లో తులసిమతి మురుగేశన్, మానసి జోషి జోడీ 21-16, 21-13తో చైనాకు చెందిన యాంగ్ క్విక్సియా, జియావో జుజియాన్ జంటను ఓడించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యూ5 ఫైనల్లో తులసిమతి మురుగేశన్, నితేశ్ కుమార్ జోడీ రజతంతో సరిపెట్టుకుంది.

షూటింగ్‌లో మోనా అగర్వాల్ స్వర్ణం
మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించింది.

## స్పోర్ట్స్

### ప్రతికా వందనం.. మెరిసిన శ్రీచరణి
**తొలి వన్డేలో భారత్ ఘన విజయం**



**వడోదర:** ప్రతికా రావల్ (100 నాటౌట్) అజేయ శతకానికి తోడు తెలుగమ్మాయి శ్రీచరణి (4/23) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో సత్తా చాటడంతో జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు ఘన విజయంతో ఆరంభించింది. శుక్రవారం జరిగిన తొలి పోరులో 9 వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. షఫాలీ వర్మ (33 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్) కూడా దంచికొట్టడంతో జింబాబ్వే ఇచ్చిన 198 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు 27.1 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ స్మృతి మంధాన (32)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన ప్రతికా ఓపెనర్‌గా వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంది. ఎలాంటి రిస్క్ తీసుకోకుండా గ్రౌండ్ షాట్లతో హోరెత్తించింది. తొలి వికెట్‌కు 94 పరుగులు జోడించిన తర్వాత మంధాన ఔటవగా.. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన షఫాలీ టీ20 స్టయిల్లో విజృంభించింది. భారీ షాట్ల తో ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడటంతో టార్గెట్ ఇట్టే కరిగిపోయింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే ఆతిథ్య బౌలర్ల దెబ్బకు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌటైంది. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు కట్టుదిట్టమైన ప్రదర్శన చేశారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ శ్రీచరణితో వరుస వికెట్లతో ప్రత్యర్థి నడ్డి విరిచింది. క్రాంతి గౌడ్ (3/42), దీప్తి శర్మ (2/44) కూడా రాణించారు. జింబాబ్వే బ్యాటర్లలో బెలోవెడ్ బిజా (62) అర్ధశతకంతో పోరాడింది. ప్రతికాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. రెండో వన్డే ఆదివారం జరగనుంది.



## రోమియో జూలియట్' మూవీ రొమాంటిక్ యాక్షన్ పోస్టర్

హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు.

దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ రొమాన్స్, యాక్షన్ అంశాల కలయికతో ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో హర్షిత్ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో గన్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. విశాఖ ధిమాన్ ఎరుపు రంగు దుస్తుల్లో అందంగా కనిపిస్తున్నారు. చుట్టూ ముళ్ల తీగలు, ఎర్ర గులాబీలు, గాలిలో ఎగురుతున్న పూలరేకులు కనిపిస్తున్నాయి. బుల్లెట్లు పోస్టర్‌కు యాక్షన్ ఫీల్‌ను తీసుకొస్తే, గులాబీలు, ఎరుపు రంగు రొమాంటిక్ కోణాన్ని హైలైట్ చేస్తున్నాయి.

ఇప్పటికే రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేసిన ఈ సినిమా 'స్టోరీ రివీల్' గ్లింప్స్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ట్యుయేషన్‌షిప్స్, క్యాజువల్ రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్, యువ జంటల మధ్య మారుతున్న సంబంధాలను 'రోమియో జూలియట్' ప్రజెంట్ చేయనుంది. నేటి యువత తమ ప్రేమ సంబంధాల్లో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఆలోచనలకు అద్దం పట్టే కథతో జెన్-జెడ్ ప్రేక్షకులని అలరించేలా వుంటుంది.

ఈ సినిమాలో వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భార్గవ్ మాచర్ల, ప్రశాంత్ రాగతి కథను అందించగా, గోపీసుందర్ సంగీతం సమకూరుస్తున్నారు. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యువ కిరణ్ ఎడిటింగ్ . కార్తా ప్రొడక్షన్స్ ధీరజ్ పొనుగోటి, ప్రకీర్తి ఉప్పలపాటి ప్రొడక్షన్ డిజైనర్స్.

నటీనటులు: హర్షిత్, విశాఖ ధిమాన్, వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్



## రియాలిటీ' మూవీ నుంచి వీడియో సాంగ్ 'భజ గోవిందం' రిలీజ్

ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్యజీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కె-రాంప్' చిత్రాల విజయాలతో జోరుమీదున్న ఆయన, ఈ సినిమాకు హీరోగా నటించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట 'భజ గోవిందం' ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తుచేస్తోంది. వైకోమ్ విజయలక్ష్మి వాయిస్ పాటకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించింది. సంగీతానికి తగ్గట్టుగా రూపొందించిన విజువల్స్‌లో పల్లెటూరి జీవితంలోని అందం కనిపిస్తుంది. కిరణ్ అబ్బవరం హోటల్ నడుపుతూ, స్నేహితులు, కుటుంబ సభ్యులతో విలువైన క్షణాలను ఆస్వాదించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఆయన సహజమైన నటన, హావభావాలు రోజువారీ జీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చాయి. ప్రతి సన్నివేశం నిజ జీవితానికి దగ్గరగా, మనసుకు హత్తుకునేలా ఉంది. ఆకట్టుకునే సంగీతం, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలతో 'భజ గోవిందం' 'రియాలిటీ' సినిమాకు తగిన ఆంథమ్‌గా నిలుస్తోంది.

## జడి సినిమా గ్లింప్స్ విడుదల..

ఒడియాలో ఘన విజయం సాధించిన 'జడి చిత్రాన్ని మెగా ప్రొడక్షన్స్ అధినేత ఉడుగుల అశ్విని కుమార్ గౌడ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రీయాన్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాజల్ రే నిర్మించిన ఈ చిత్రానికి దిబ్య జ్యోతి ఉదయ సింగ్ రచన, దర్శకత్వం వహించారు. సైలేంద్ర సమంతరాయ్, ప్రియంబద స్వైన్, ఆకాశ్ హోతా ప్రధాన పాత్రల్లో నటించగా.. సుశాంత్ దాస్ మహాపాత్ర, రబి మిశ్రా, బాలకృష్ణ నాయక్, కృష్ణ రౌత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం కామెడీ క్రైమ్ డ్రామాగా తెరకెక్కింది. తాజాగా తెలుగు ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. ఈ కథ గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. కాలేజీ యువకుల మధ్య స్నేహం, అనుబంధాలతో ప్రారంభమై.. ప్రేమకథగా మారుతూ, స్నేహితుల మధ్య తలెత్తే విభేదాలు, సంఘర్షణలను ఆసక్తికరంగా పరిచయం చేస్తుంది. ప్రేమకథకు మించి జీవితంలోని విభిన్న భావోద్వేగాలు, బంధాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది.






## 'జో జో' కాషన్ 2 సినిమా ఇంట్రెస్టింగ్ వీడియో రిలీజ్

హీరో, హీరోయిన్‌ని ప్రేమిస్తానంటాడు.. దానికి బదులుగా"పడుచు పిల్ల కానొస్తే... ఓ నాలుగు దినాలు వెనక పడి... పని కానిచ్చుకొని... పారిపోయే టైపా? ఇష్టపడిన పిల్లని దాని బాధ్యతలతో సహా పెళ్ళి చేసుకొని దాన్ని జీవితాంతం మోసెంత గుండకాయ ఉన్న మొగోడి టైపా అని" ఆ పిల్ల ప్రశ్నిస్తాది .. దానికి హీరో బదులిస్తూ.. "సత్య ప్రమాణికంగా చెబుతున్నా ఒకతూరి మాట ఇచ్చినానంటే మడమ తిప్పని వంశం మాది... బాలయ్య బాబు టైపు" అని హీరో గడుసుగా సమాధానం ఇస్తాడు. హీరోయిన్ మరి హీరోని ప్రేమిస్తాదా! అని తెలియాలంటే మాత్రం 'జో జో' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. కృష్ణ కమల్ , మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512